# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


## ఉప ఎన్నికకు కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

అమరావతి, జూన్ 25: ఏపీలోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితాలు రేపు వెలువడనున్నాయి. ఉప ఎన్నికల కౌంటింగ్‌కు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 24న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 178 పోలింగ్ బూత్ ల పరిధిలో 2,13, 644 మంది ఓటర్లు ఉండగా 1,37,038 (64.17 శాతం ) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో పోలింగ్ జరగగా చేజర్ల మండలంలో అత్యధికంగా 67.9 శాతం , అత్యల్పంగా మర్రిపాడులో 59.8 శాతం నమోదైంది. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 82.49 శాతం ఓట్లు పోలవగా ఈ ఎన్నికల్లో 64.17 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్‌కు ఎన్నికల అధికారులకు, సిబ్బందికి ఒకరోజు ముందుగానే శిక్షణ ఇచ్చి ఎన్నికల నిబంధనలను వివరించారు. ఉదయం 7 గంటలలోగా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఉదయం 11 గంటల వరకు పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారుఏపీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఆకస్మిక మరణంతో ఆత్మకూరుకు ఉప ఎన్నికను నిర్వహించగా 14 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. వీరిలో ప్రధానంగా అధికార వైసీపీ , బీజేపీ అభ్యర్థుల మధ్య గెలుపు, ఓటములు ఉంటాయని భావిస్తున్నారు.


హైదరాబాద్ | ఆదివారం 26-6-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 263 | పేజీలు:6 | వెల: రూ.1/-


## 'మహా' సంక్షోభం.. ముంబైలో 144 సెక్షన్ విధింపు

ముంబై, జూన్ 25: మహారాష్ట్రలో పొలిటికల్ హైడ్రామా కొనసాగుతున్నది. సంక్షోభం నేపథ్యంలో శివసేన జాతీయ కార్యవర్గం సమావేశమైంది. సమావేశంలో సీఎం ఉద్ధవ్ ఠాక్రే హాజరయ్యారు. అయితే, అంతకు ముందు పుణేలోని ఏక్‌నాథ్ షిండే వర్గం ఎమ్మెల్యే తానాజీ సావంత్ ఇల్లు, కార్యాలయాన్ని శివసేన కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలో 144 సెక్షన్ విధించారు. అలాగే ఏక్‌నాథ్ షిండే థానే నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

గౌహతిలో శివసేన తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందం సమావేశమైంది. శివసేనకు చెందిన 38 మంది రెబల్ ఎమ్మెల్యేలు, 10 మంది స్వతంత్రులు క్యాంప్‌లో ఉన్నారు.

ప్రస్తుతానికి సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై ఎలాంటి స్పష్టత రాలేదు. గౌహతిలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన ఎమ్మెల్యేల సమావేశం అనంతరం 38 మంది ఎమ్మెల్యేల జాబితాను ఏక్‌నాథ్ షిండే విడుదల చేశారు. మహారాష్ట్రలో శివసేన ప్రభుత్వాన్ని కూల్చేందుకు షిండేకు కేవలం 37 శివసేన ఎమ్మెల్యేలు మాత్రమే అవసరం.

## సంగారెడ్డిలో క్రైస్తవ సమాధుల స్థలం కేటాయింపుకు చర్యలు-ఆర్డీఓ మెంచు నగేష్



సంగారెడ్డి జూన్ 25 (నేటినిజం ప్రతినిధి) జిల్లా కేంద్రంలో గల క్రైస్తవుల స్మశాన వాటిక స్థలం ఏర్పాటు కొరకు ఇండిపెండెంట్ పాస్టర్ల సంఘ కాపరులు శనివారంనాడు సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి మెంచు నగేష్ ని కలిసి తమ విన్నపం తెలియజేశారు . రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు గత సంవత్సరం క్రితమే ఉత్తర్వులు ఇచ్చి క్రైస్తవుల కు సమాధుల స్థలం కేటాయించాలని అధికారులకు సూచించిన విషయన్ని గుర్తుచేశారు . ఈ విషయమై ఆర్డిఓ నగేష్ వెంటనే సత్వర చర్యలు చేపట్టి క్రైస్తవ సమాధుల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి క్రైస్తవ పాస్టర్లు ఎం ఎస్ పాల్, ఏ శాలెం రాజు, బి బాలరాజు, జె అమృతరాజ్, డి సురేష్, బి విజయ్ కుమార్, బి కుమార్, జాన్ భాస్కర్, విజయ్ కుమార్, అరుణ్ కుమార్, ఏలియా, విలియమ్స్, ప్రసన్న కుమార్, దేవదాస్, పవన్ కుమార్, పాల్గొన్నారు.

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ వైద్యారోగ్య రంగం : హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 25: తెలంగాణ వైద్య, ఆరోగ్య రంగం దేశానికే ఆదర్శంగా మారుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రానికి చెందిన 13 ప్రభుత్వ ఆసుపత్రులు కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ నుంచి నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఔఖియా) సర్టిఫికెట్లు సాధించాయి. అలాగే మరో మూడు దవాఖానలకు రీ-సర్టిఫికేషన్ వచ్చిందని హరీశ్‌రావు తెలిపారు. లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్ నిర్వహణలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నందుకు నిర్మల్ ఏరియా దవాఖానకు 'లక్ష్య' గుర్తింపు లభించింది.

ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ.. రాష్ట్ర ప్రభుత్వానికి రాసి.. శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 143 హాస్పిటల్స్‌కు ఎన్‌క్వాష్ గుర్తింపు వచ్చిందని, ఈ గుర్తింపు కలిగిన దవాఖానలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో హరీశ్‌రావు తెలిపారు. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఈ గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొదటి స్థానమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ దవాఖానలకు జాతీయ స్థాయి గుర్తింపు రావడంపై హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయన్న మంత్రి.. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ జాతీయస్థాయి గుర్తింపే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో పీహెచ్‌సీ స్థాయి నుంచి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితమైన జాతీయస్థాయి నాణ్యతా ప్రమాణాల గుర్తింపును తెలంగాణలోని జిల్లా, ప్రాంతీయ, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సాధిస్తున్నాయంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

### చరిత్రలో నేటినిజం







(జూన్ 26 సామవేదం షణ్ముఖశర్మ పుట్టిన రోజు...)

-రాధశ్రీ

సెల్: 9494481210

# అన్నిరంగాల్లో హైదరాబాద్ అభివృద్ధి : మంత్రి తలసాని





హైదరాబాద్, జూన్ 25: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ మహానగరం అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి చెందిందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ లోని సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద 5 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునికంగా నిర్మించిన పుట్ ఓవర్ బ్రిడ్జిని మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్యే సాయన్న, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, బేవరేజెస్ చైర్మన్ గజ్జల నగేష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ పుట్ ఓవర్ బ్రిడ్జి కు రెండు వైపులా లిఫ్ట్ లు, ఎస్కలేటర్ లను ఏర్పాటు చేయడం జరిగింది. వీటితో పాటు 8 సీసీ కెమెరాలను కూడా అమర్చారు. వృద్ధులు, చిన్నారులు సైతం ఎంతో సులువుగా ఎక్కి రోడ్డును దాటే విధంగా పుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా మున్సిపల్ శాఖ మంత్రి శ్రీ కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో వేలాది కోట్ల రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం కోసం నూతనంగా ప్లై ఓవర్ లు, అండర్ పాస్ ల నిర్మాణం తో పాటు రోడ్ల అభివృద్ధి, విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయని వివరించారు. పాదచారులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు పుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కై వాక్ లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఉఊఓఅ పరిధిలో ఇప్పటి వరకు 7 పుట్ ఓవర్ బ్రిడ్జిలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, మరో 22 బ్రిడ్జిల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని త్వరలోనే వాటిని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. అంతేకాకుండా నాలాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు గాను సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం క్రింద నాలాల అభివృద్ధి తో పాటు పూడిక తొలగింపు పనులు జరుగుతున్నాయని తెలిపారు. నాలాల అభివృద్ధి తో ఎన్నో సంవత్సరాల నుండి నాలా పరిసర ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు దీపిక, కొలన్ లక్ష్మి, మహేశ్వరి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఽాఇ అనిల్ రాజ్, ఆఆ ముకుంద రెడ్డి, ఇఇ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు కేవలం భాష కాదు.. జీవన విధానం, నాగరికత: జస్టిస్ ఎన్వీ రమణ



న్యూజెర్సీ: తెలుగు అనేది కేవలం భాష కాదు.. జీవన విధానం, నాగరికత అని జస్టిస్ ఎన్వీ రమణ (ఔఎ ఖీజీఎజీనిజీ) అన్నారు. మాతృభాషను, మాతృమూర్తిని పూజించడం ఒక ప్రత్యేకత అని చెప్పారు. అమ్మ భాషలోని తియ్యదనం అనుభవించాల్సిందే.. మాటల్లోనే చెప్పలేమన్నారు. అమెరికాలోని న్యూజెర్సీలో తెలుగు కమ్యూనిటీ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో జరిగిన మీట్ అంట్ గ్రీట్ కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాతృభాష, మాతృభూమిలో ఉన్న ప్రేమను ఆస్వాదించాలని వెల్లడించారు. మన భాషతో పాటు పరాయి భాషనూ గౌరవిస్తున్నామని తెలిపారు. ఇంట్లో పెద్దలు పిల్లలతో తెలుగులో మాట్లాడాలని కోరారు. మాతృభాషలోనే చదివి నేను ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు.

మా తెలుగు తల్లికి మల్లెపూల దండతో కార్యక్రమం ప్రారంభమైందని సీజేఐ అన్నారు. తెలుగుతల్లి ముద్దు బిడ్డలుగా ఉన్న మిమ్మల్ని కలవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో దశల్లో అనేక పరీక్షలు ఎదుర్కొని ముందుకు సాగుతున్నారని వెల్లడించారు. మాతృభూమిని, సొంత మనుషులను వదులుకుని ఇక్కడ ఉంటున్నారని తెలిపారు. తెలుగు ప్రజల్లో నేను ఒకడిగా ఉండటాన్ని గర్విస్తున్నానని చెప్పారు. పుట్టిన ఊరు, మట్టివాసన, మట్టి గుబాళింపును నెమరువేసుకోవాలని ఎన్ఆర్ఐలకు సూచించారు. తెలుగు సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

అమెరికాలో దాదాపు 7 లక్షల మంది తెలుగువారు ఉన్నారని చెప్పారు. ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేస్తూ జీవితాన్ని గడుపుతున్నారు. మీ నిబద్ధత చూస్తుంటే తెలుగుజాతి భవిష్యత్తు సురక్షితమని విశ్వసిస్తున్నాని అన్నారు. అమెరికాలో తెలుగువారు సంపద సృష్టిస్తున్నారని చెప్తుండటం గర్వకారణమన్నారు.

ప్రపంచంలో అనేక దేశాలు, ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడ్డారని వెల్లడించారు.

### రైతు కుటుంబం నుంచి వచ్చా..

రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను సీజేఐ స్థాయికి ఎదిగానని జస్టిస్ ఎన్వీ రమణ చెప్పారు. తెలుగువాడిగా సీజేఐ అవకాశం రావడం చాలా సంతోషాన్నిచ్చిందని చెప్పారు. న్యాయవాద వృత్తిలో ఉన్నత స్థాయికి చేరుకోవడం చాలా కష్టమన్నారు. పట్టుదలతో పాటు తల్లిదండ్రుల ఆశీర్వాదాలు ఉన్నందునే ఈ స్థాయికి చేరుకున్నానని వెల్లడించారు. రాష్ట్రపతిని లేదా చిన్న ఉద్యోగిని కలిసినా తన ప్రవర్తనలో మార్పు ఉందని చెప్పారు.

మాతృభాషలో చదివితే ఉద్యోగాలు రావనేది అపోహ మాత్రమేనని జస్టిస్ ఎన్వీ రమణ స్పష్టం చేశారు. తాను లా మాత్రమే ఇంగ్లిష్ మీడియంలో చదివానని చెప్పారు. మాతృభాషలో చదివి తాను ఈ స్థాయికి వచ్చానని మరచిపోవద్దని సూచించారు. మన భాష, సంస్కృతి మరచిపోతే జాతి అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. తెలుగు భాష కోసం ఉద్యమం చేయాల్సిన దుస్థితి ఏర్పడటం బాధగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. జాషువా, దాశథి, శ్రీశ్రీ వంటి మహానుభావులు వెలకట్టలేని సంపద ఇచ్చారని చెప్పారు.

### ప్రజా సంక్షేమమే పరమావధిగా సత్వర న్యాయం

ప్రజా సంక్షేమమే పరమావధిగా సత్వర న్యాయం అందాలని ఆకాంక్షించారు. న్యాయ సమీక్ష చేసే అధికారం భారతదేశ న్యాయవ్యవస్థకు ఉందని చెప్పారు. ఎవరైనా జడ్జి పదవి చేపట్టాక న్యాయాన్ని నిలబెట్టేలా ప్రవర్తిస్తారని తెలిపారు. ప్రజల్లో చైతన్యం, విద్యాజ్ఞానం పెరిగిందన్నారు. రాజకీయ అభిప్రాయాలతో సంబంధం లేకుండా జడ్జిలు పనిచేస్తారని తెలిపారు. న్యాయవ్యవస్థలో ఖాళీలను భర్తీప్రక్రియ వేగంగా పూర్తిచేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టులో తన హయాంలో తొమ్మిది మంది జడ్జిలను నియమించామని గుర్తుచేశారు.

## ఫ్లిప్ కార్ట్‌తో ఆన్ లైన్ వ్యాపార ఒప్పంద కార్యక్రమం-జ్యోతి వెలిగించి ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి





హైదరాబాద్ : ప్రభుత్వ ఆశయం, సీఎం కేసీఆర్ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన సంస్థ ముందడుగు వేసింది. ఇప్పటిదాకా విజయవంతమైన టోకు వర్తకం నుంచి.. ఆన్‌లైన్ ద్వారా నేరుగా వినియోగదారులకు చేరేలా రిటైల్ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. దేశంలోనే తొలిసారిగా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారులతో ఫ్లిప్‌కార్ట్ చారిత్రాత్మక ఒప్పందం చేసుకున్నది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెర్ప్ అధికారులు, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధుల మధ్య శనివారం ఒప్పందం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. దుండగన్న వ్యవసాయం ఇప్పుడు పండుగలా మారిందన్నారు. సాగు దిగుబడి పెరిగిందన్నారు.

దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ చేరిందని, కొత్తగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సైతం నెలకొల్పుతున్నట్లు చెప్పారు.

గతేడాది రూ.15వేల కోట్ల రుణాలు ఇస్తే.. ఈ సారి మహిళా సంఘాలకు రూ.18వేలకోట్లు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు.

కనీసం గ్యారంటీ కూడా అడగకుండా బ్యాంకు మహిళా సంఘాలకు రుణాలిస్తున్నాయని, ఇది మన మహిళా సంఘాలు సాధించిన విజయానికి సంకేతమన్నారు. రాష్ట్ర మహిళా సంఘాలకు దేశంలోనే మంచి పేరుంది.

సాగు, వ్యవసాయోత్పత్తులు, ఇతర ఉత్పత్తుల రంగంలోకి మహిళ వచ్చారన్నారు. మహిళా సంఘాలు ముందుకు రావడంతో దళారుల వ్యవస్థకు బ్రేక్ పడిందన్నారు. మహిళలు నాణ్యమైన వస్తువులు తయారు చేస్తున్నారని, సంఘాలు మన తెలంగాణలో ఉండటం, ఆ శాఖకు మంత్రిగా ఉండడం తనకు గర్వంగా ఉందన్నారు.

మహిళల్లో మంచి చైతన్యం వచ్చిందని, అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారంటూ ప్రశంసించారు. అన్ని రకాల సీజనల్ పండ్లు, వ్యవసాయ ఉత్పత్తులను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు చేర్చాలని, కల్తీ లేని, నిఖార్సైన, నాణ్యమైన వస్తువులు విక్రయించాలన్నారు. ప్రస్తుతానికి 100 రకాల ఉత్పత్తులను గుర్తించారని, మరిన్ని వస్తువులను గుర్తించాలన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ రాష్ట్రంలో 4.5 లక్షల గ్రూప్‌లు.. 48లక్షల మంది సభ్యులున్నారని, రాష్ట్రాలు దేశం దాటి అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేస్తున్నారన్నారు.

18వేలకోట్ల బ్యాంకర్లు ఇచ్చిన రుణాలు మహిళల వద్ద పెట్టుబడి ఉన్నాయన్నారు. ఫ్లిప్‌కార్ట్ ద్వారా పెద్ద మార్కెటింగ్ ద్వారా ప్లాట్ ఫామ్ లభిస్తుందన్నారు.

మన ఉత్పత్తులు బాగుండాలనీ, మళ్లీ మళ్లీ మన వస్తువుల్ని వినియోగదారులు కొనుగోలు చేసేలా ఉండాలని, వస్తువులకు ఒక బ్రాండ్ ఏర్పడాలన్నారు. సెర్ప్ సీఓఓ రజిత, ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ వైస్ ప్రెసిడెంట్ స్మృతి రవిచంద్రన్, డైరెక్టర్ శరత్ సిన్హా ఒప్పంద వివరాలను వివరించారు. 80కిపైగా కేటగిరీలలో 15 కోట్ల ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్న ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందంతో ప్రాథమిక దశలో 100కుపైగా వస్తువులు ఉత్పత్తి చేస్తున్న మన స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారులకు ఈ ఒప్పందం మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## హెల్పింగ్ హార్ట్స్ రూపొందించిన కరపత్రం ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, జూన్ 25 (నేటినిజం ప్రతినిధి): "ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం"ను పురస్కరించుకొని హెల్పింగ్ హార్ట్స్ రూపొందించిన " డ్రగ్స్ కు యువత బానిస కావద్దు- బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు" అను కరపత్రంను ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ హెగ్డేఆవిష్కరించారుఈసందర్భంగా జిల్లా ఎస్పీమాట్లాడుతూ యువత డ్రగ్స్ కు బానిస కావద్దు అన్నారు.డ్రగ్స్ వాడకం సంతోషంతో మొదలై దుఃఖంతోనే అంతమౌతుందని అన్నారు.తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై అనునిత్యం దృష్టిపెట్టాలని అన్నారు. ప్రవర్తనలో మార్పులు ఎప్పటికప్పుడు గమనిస్తు సరైన మార్గదర్శనం చేయాలని అన్నారు.డ్రగ్స్ కు అలవాటు పడిన తర్వాత బాధపడితే ప్రయోజనం లేదని భవిష్యత్తు ను అందకారంలోకి నెట్టిన వారవుతారని అన్నారు. మెదడు, నరాల వ్యవస్థ దెబ్బతిని శాశ్వత మానసిక వైకల్యం వచ్చేఅవకాశాలుంటాయని అన్నారు.నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్ స్టాన్స్ యాక్ట్ 1985 ప్రకారం శిక్షార్హులు అవుతారని అన్నారు.మాదకద్రవ్యాలు అమ్మడం, సేవించడం రెండు నేరమని అన్నారు. చట్టాలు బలంగా ఉన్నాయని తెలుపుతూ తర్వాత బాధపడి లాభం లేదని అన్నారు.మా పోలీస్ శాఖ జిల్లాలో డ్రగ్స్ పట్ల యువతలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ డ్రగ్స్ పై అవేర్నెస్ కోసం కృషి చేయడం అభినందనీయమని అన్నారు.మరింతగా కార్యక్రమాలు రూపొందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రముఖసైకాలజిస్ట్ కె. పున్న0చందర్, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, న్యాయవాది కనుకుంట్ల తిరుమల, కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ వి.శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనే మా లక్ష్యం - కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జూన్ 25:రాజకీయాలు ఎలా చేయాలో ఆప్ పార్టీకి తెలియదని..అవినీతి నిర్మూలనకి తమ పార్టీ కృషి చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కాగా పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో కలిసి హిమాచల్ ప్రదేశ్ లోని కులులో రోడ్ షో నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడారు మాకు రాజకీయాలు తెలియవు. రాజకీయాలు చేయడానికి మేం ఇక్కడ లేము. మా ప్రయాణం అన్నా హాజరే ఉద్యమంతో మొదలైంది. తరువాత పార్టీ పెట్టాం. అవినీతిని దేశం నుంచి తరిమికొడతామని శపథం చేశాం.

ముందు ఢిల్లీలో అవినీతిని అంతం చేశాం. ఇప్పుడు పంజాబ్ లో కూడా అదే చేయబోతున్నామని చెప్పారు. అవినీతి ఆరోపణలపై తన మంత్రిని జైలుకు పంపినందుకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ను అభినందించారు. భగవంత్ మాన్ కావాలంటే ఆ విషయాన్ని కార్పెట్ కింద తేలికగా కప్పేయవచ్చని, కానీ ఆయన అలాంటి పనికి పూనుకోలేదని అన్నారు. దానికి బదులు మాన్ మంత్రిపై చర్య తీసుకున్నారని చెప్పారు. ఒక సీఎం తన మినిస్టర్ ను జైలుకు పంపడం మీరు ఎప్పుడైనా విన్నారా .. తన ఆరోగ్య మంత్రి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు మన్ సాహబ్ కనుగొన్నారు. ఈ విషయం అప్పటికి ప్రతిపక్షాలకు, మీడియాకు తెలియదు. కావాలంటే ఆయన దానిని చాపకింద పారేసి ఉండేవారు. లేదా ఆ నిమిషం నుంచి తన వాటా అడిగేవాడు. కానీ ఆయన మంత్రిని జైలుకు పంపించారని కొనియాడారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి -జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. టి. శ్రీనివాసరావు



ఖమ్మం, జూన్ 24 (నేటినిజం ప్రతినిధి): రేపటి సమాజానికి పౌరులైన నేటి బాలలను కార్మికులుగా మార్చవద్దని, దురాచారమైన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. టి. శ్రీనివాస రావు అన్నారు. శనివారం న్యాయమూర్తి తన చాంబర్లో జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్, కమిషనర్ ఆఫ్ పోలీస్ విష్ణు ఎస్ వారియర్, న్యాయ సేవా సంస్థ న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషాలతో కలిసి బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, పుస్తకాలు పట్టాల్సిన చిట్టి చేతులు పనిముట్లను పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడులు మానేసి పనులకు వెళుతున్న బాలకార్మికులను తిరిగి బడిలో చేర్పించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసే ఉద్దేశంతోనే గోడపత్రిక లను తయారు చేసినట్లు న్యాయమూర్తి వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, జిల్లా విద్యాశాఖ, కార్మిక శాఖ, జిల్లా సంక్షేమ శాఖల ద్వారా ఈ విషయంపై తగు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి ప్రతి సంవత్సరం ప్రభుత్వం చేపట్టే ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా పోలీసు శాఖ తగిన సహాయం చేస్తుందని పోలీసు కమిషనర్ విష్ణు. ఎస్. వారియర్, అన్నారు.

న్యాయ సేవా సంస్థ ద్వారా ఈ విషయాలలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు న్యాయసేవా సంస్థ న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి సిహెచ్. సంధ్యారాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి టి. విష్ణువందన, న్యాయవాదులు శ్రీనివాస చౌదరి, ఇమ్మడి లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వానము





సుప్రసిద్ధ పాత్రికేయులు
జి.యస్. వరదాచారి
జీవన సాఫల్య అభినందన సభ,
పరిణత పాత్రికేయం
గ్రంథావిష్కరణ - అంకితం

వేదిక :
ప్రెస్ క్లబ్, సోమాజిగూడ, హైదరాబాద్
జూన్ 26వ తేదీ ఆదివారం
సమయం : ఉదయం గం.10.30 ని॥లకు

ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త :
డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఎ.ఎస్. (రి)
సలహాదారు, తెలంగాణ ప్రభుత్వం

విశిష్ట అతిథి :
శ్రీ అల్లం నారాయణ
అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ

ఆత్మీయ అతిథులు :
శ్రీ యం.వి. ఆర్. శాస్త్రి
ప్రముఖ సంపాదకులు
డా॥ కె. రామచంద్రమూర్తి
ప్రముఖ సంపాదకులు

గ్రంథ పరిచయం
డా॥ కె. శ్రీనివాస్
ఆంధ్రజ్యోతి సంపాదకులు

సభాధ్యక్షులు
దాసు కేశవరావు
అధ్యక్షులు
వయోధిక పాత్రికేయ సంఘం

కె. లక్ష్మణరావు, కార్యదర్శి
వయోధిక పాత్రికేయ సంఘం

పాత్రికేయులు అందరికీ సాదర ఆహ్వానం

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్యాలు

**(26 జూన్ 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల దురలవాటు, అక్రమ రవాణ వ్యతిరేక దనం' సందర్భంగా)**

చైనాలో ' ప్రథమ ఓపియమ్ యుద్ధం (ఫస్ట్ ఓపియమ్ వార్)' జరుగుతున్న వేళ 1839లో 'లిన్ గ్జీగ్జు' నేతృత్వంలో ప్రమాదకర ఓపియమ్ అక్రమ వ్యాపారాన్ని ఛేదించిన సంఘటన తొలిసారి ప్రపంచ మానవాళి దృష్టిని ఆకర్షించింది. 17 – 26 జూన్ 1987 మధ్య వియన్నాలో నిర్వహించిన మాదకద్రవ్యాల వాడకం, అక్రమ రవాణ నిరోధక సమావేశంలో మాదకద్రవ్యాల దురలవాటుతో మిలియన్ల అమాయక ప్రజలు, ముఖ్యంగా యువతీయువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ వాడకాన్ని తగ్గించడానికి కఠిన చర్యలతో పాటు వాటి అక్రమ రవాణాకు తగు పటిష్ట చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. ఈ సమావేశానికి గుర్తుగా 07 డిసెంబర్ 1987న ఐరాస జనరల్ అసెంబ్లీ తీసుకున్న తీర్మానం ప్రకారం 26 జూన్ 1989 నుంచి ప్రతి ఏట 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల దురలవాటు, అక్రమ రవాణ వ్యతిరేక దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. ఇదే అంశం ఆధారంగా కొన్ని దేశాలు 25–31 జూన్ వరకు 'జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక వారం (నేషనల్ ఆంటీ–డ్రగ్ వీక్)' కూడా నిర్వహిస్తున్నారు. ప్రపంచాన్ని కమ్మిన కరోనా మబ్బుల నేపథ్యంలో వైద్య ఆరోగ్య, యువజన, పోలీస్ శాఖలు సమన్వయంతో ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల వేదికలుగా మాదక ద్రవ్యాల వినియోగం పట్ల అవగాహన, అక్రమ రవాణ నిరోధక చర్యలను ప్రచారం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. 2007 వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ వివరాల ప్రకారం ప్రతి ఏట విశ్వవ్యాప్తంగా వి 322 బిలియన్ డాలర్ల మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం జరుగుతోందని అర్థం అవుతున్నది.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల సమస్య :

మాదక ద్రవ్యాల దురలవాటు అంతర్జాతీయ సమస్యగా రూపొందింది. దేశాల సరిహద్దులు దాటుతూ అక్రమ రవాణ చేసే స్మగ్లర్లు, తీవ్రవాద గుంపులు తమ అక్రమ సామ్రాజ్యాలను విస్తరించడం, సప్లై చైన్‌ను ఏర్పాటు చేసుకోవడం యద్దేచ్ఛగా జరుగుతున్నది. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దురలవాటు, అక్రమ రవాణ వ్యతిరేక దినం–2022 నినాదంగా 'మాదకద్రవ్యాలతో ఆరోగ్య సవాళ్ళు, మానవీయ సంక్షోభ పరిష్కారాలు(అడ్రెసింగ్ డ్రగ్ ఛాలెంజెస్ ఇన్ హెల్త్ అండ్ హుమానిటేరియన్ క్రయసిస్)' అనబడే నినాదాన్ని తీసుకొని పలు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుట జరుగుతున్నది. 'ఐరాస ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' వరల్డ్ రిపోర్ట్ – 2020 వివరాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 269 మిలియన్ల జనులు మాదక ద్రవ్యాలను వాడుతున్నారని, వీరిలో 35 మిలియన్లు మాదకద్రవ్యాల సంబంధ రుగ్మతలతో బాధ పడుతున్నారని తెలుస్తున్నది. కరోనా అలల వల్ల ఉద్యోగ ఉపాధులు తగ్గడంతో నిరుద్యోగ యువత నిరాశకు గురికావడంతో మాదకద్రవ్యాల వాడకం యువతలో పెరిగిందని కూడా తెలుస్తున్నది. కోవిడ్–19 విజృంభనతో ఓపియమ్ కొరత ఏర్పడటంతో ప్రత్యామ్నాయంగా బెంజోడైజీపైన్, ఆల్కహాల్ లాంటి కృత్రిమ అత్యంత ప్రమాదకర డ్రగ్స్ వాడకం పెరిగింది.

భారత్‌లో మాదకద్రవ్యాల సమస్య :

ఇండియాలో దాదాపు 14.6 కోట్ల జనులు ఆల్కహాల్ దురలవాటుకు లోనైనారని, 3.1 కోట్లు ప్రజలు కన్నాబిస్ డ్రగ్స్, దాదాపు 3 కోట్లు ఓపియం మరియు 8.5 లక్షల ప్రజలు మాదకద్రవ్యాలను సూది మందు రూపంలో (ఐవి) వాడుతున్నారని తేలింది. ఇలాంటి సూది మందులను వాడడం వల్ల హెచ్ఐవి–ఏయిడ్స్ కూడా పెరిగిపోయే ప్రమాదం ఏర్పడుతున్నది. భారతదేశంలో మాదకద్రవ్యాల కేంద్రంగా సరిహద్దు రాష్ట్రం పంజాబ్ అగ్ర భాగాన ఉన్నది. అంతర్జాతీయ సరిహద్దు రాష్ట్రాల్లో డ్రగ్స్ అక్రమ రవాణ, వాడకం ఎక్కువగా కనిపిస్తున్నది. అస్సాం, ఢిల్లీ, హర్యానా, మణిపూర్, మిజోరాం, సిక్కిం, మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ మరియు యుపీ రాష్ట్రల్లో మాదకద్రవ్యాల లభ్యత, వాడకం అధికంగా నమోదు అవుతున్నాయి. కాశ్మీర్ సరిహద్దు ప్రాంతాల్లోంచి అక్రమ రవాణాకు తోడుగా కన్నాబిస్, హెరాయిన్, కొకేయిన్ లాంటి మాదకద్రవ్యాలను ఉత్పత్తి కూడా జరుగుతున్నది. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశ సరిహద్దుల గుండా డ్రగ్స్ దేశంలోకి అక్రమంగా చేరవేయడం జరుగుతున్నది.

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు :

మాదకద్రవ్యాలు లేదా డ్రగ్స్ దురలవాటుకు గురి అయిన వారు అనేక దుష్ప్రభావాలకు లోనవుతారు. మానసిక కల్లోలం, ఆందోళన, నిరాశ, చికాకు, సుఖభ్రాంతి, అతి చురుకుదనం, అతిగా కదలడం, మానవ సంబంధాలలో అసాధారణ ప్రవర్తన, ప్రేరణ కోల్పోవడం, బాధ్యతల్ని విస్మరించడం, చట్టవ్యతిరేకంగా ప్రవర్తించడం, సత్వర అలవాట్ల మార్పు, విధులకు గైర్హాజరు కావడం, శారీరకంగా బలహీణ పడడం, నిద్ర లేమి, సోమరితనం, అనవసరంగా ఆవేశ పడడం, భయం లేకపోవడం, ఉద్రేక పడడం, మానసిక ప్రవర్తనలో సమూల మార్పులు, సమాజంలో చిన్నచూపుకు గురికావడం, వ్యక్తిత్వ వినాశనం లాంటి పలు అనర్థాలు జరుగుతాయి. మాదకద్రవ్యాల దురలవాటు దుష్పరిణామాల్లో మెదడు క్రియాశీలతలో మార్పులు, అనవసరంగా గాయాల పాలుకావడం, రోగనిరోధకశక్తి పడిపోవడం, హృదయనాళ సమస్యలు, వికారం, వాంతులు, కాలేయ హాని, కడుపు నొప్పి, స్ట్రోక్స్, హార్ట్ అటాక్, నిర్ణయం శక్తి నశించడం, శాశ్వతంగా మెదడు ప్రభావితం కావడం, భావోద్వేగాల అస్థిరత్వం, వైద్య సమస్యలు, చట్ట వ్యతిరేక ముద్ర, ఆర్థిక లోటు, జైలు శిక్ష, వివాహితులైతే విడాకులకు దారి తీయడం, పిల్లల్ని తిట్టడం, గృహ హింసకు పాల్పడడం లాంటి అనేక ప్రతికూల ప్రభావాలు కలుగుతాయి.

పలు రకాల మాదకద్రవ్యాలు:

కన్నాబిస్ ఆధారిత చరస్, గంజాయి, భంగ్ లాంటి మత్తు మందులను మిలియన్ల భారతీయులు వాడుతున్నారని తేలింది. డ్రగ్స్‌లో ముఖ్యంగా స్టిమ్యులెంట్స్ (కొకేయిన్), డిప్రెసెంట్స్ (ఆల్కహాల్), ఓపియ్–ఆధార పెయిన్ కిల్లర్స్ (హెరాయిన్), హాలుసినోజన్స్ (యల్‌యస్‌డి) అనబడే నాలుగు వర్గాలు ఉన్నాయి.

కట్టడి మార్గాలు:

మాదకద్రవ్యాల దురలవాటు అతి ప్రమాదకరమైందని, అంతర్జాతీయ సమాజ సమన్వయంతోనే వాటి అక్రమ రవాణ అరికట్టవచ్చనే సందేశాన్ని ఇస్తూ, డ్రగ్స్ వాడకంతో దేశ యువశక్తి నిర్వీర్యం కావడం, దేశ ఆర్థిక సామాజిక సమగ్రాభివృద్ధి కుంటుపడడం జరుగుతుంది. మాదకద్రవ్యాల దురలవాటును మాన్పించడం, ఉత్పత్తిని అరికట్టడం, డ్రగ్స్ వాడే వారికి పునరావాసంగా వైద్య సహాయం చేయడం, డ్రగ్స్ పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం, అక్రమ రవాణాను నిలువరించడం, డ్రగ్స్ సప్లై చైన్‌ను ఛేదించి కఠిన చర్యలు తీసుకోవడం, మాదకద్రవ్యాల నిరోధ చట్టాన్ని అమలు చేయడం లాంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అంతర్జాతీయ స్థాయి నుంచి పాఠశాలల ఆవరణల వరకు విస్తరించిన మాదకద్రవ్యాల విషకోరలను పీకడానికి అంతర్జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పటిష్ట చర్యలు తక్షణమే తీసుకోవాలి. మాదకద్రవ్యాల అక్రమ రవాణ అరికట్టే అంతర్జాతీయ వ్యవస్థ, స్థానిక రవాణ, సరఫరాలను నియంత్రించే చర్యలు, తీరప్రాంతాలు, సరిహద్దుల్లో కఠిన కట్టుదిట్టమైన నియంత్రణ వ్యవస్థలను చేపట్టడంతోనే డ్రగ్స్ మహమ్మారిని అడ్డుకోవడం జరుగుతుందని గమనించాలి.

సినీ పరిశ్రమ, విద్యాలయాలు, మహానగరాలు, రేవ్ పార్టీలు, పబ్‌లు, బార్లు, రిసార్టులు, హోటల్స్ లాంటి ప్రదేశాలు మాదకద్రవ్యాల వాడక కేంద్రాలుగా నిలుస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో మాదకద్రవ్యాల వాడకం 30 శాతం పెరగడం గమనించారు. మాదకద్రవ్యాల దురలవాటు ప్రాణాంతకమని హెచ్చరిస్తూ, యువతను సన్మార్గంలో నడిపించాల్సిన కనీస బాధ్యత మనందరి మీద ఉందని గుర్తించాలి. దేశ యువత మత్తులో తూలకుండా, బాధ్యతాయుత పౌరులుగా జాతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆశిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## పోలీసుల పేరు చెప్పి డబ్బులు అడిగిన మంత్రి పీఏ మల్లికార్జున్.. కేసు నమోదు చేసిన పోలీసులు



న్యూఢిల్లీ, జూన్ 25:పోలీస్ స్టేషన్లో నమోదయిన కేసు విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన మంత్రి పీఏ మల్లికార్జున్ పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ రావు తెలిపారు. గత నెల 17న కరీంనగర్ సిటీలోని వాటర్ ప్లాంట్ లపై పోలీసులు తనిఖీలు నిర్వహించి నిబంధనలను పాటించని వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఇదే క్రమంలోలో సుభాష్ నగర్లోని ఓ వాటర్ ప్లాంట్ పై కేసు నమోదు చేయగా ఆ ప్లాంటు యజమాని మంత్రి పీఏ మల్లికార్జున్ ను సంప్రదించారు. దీంతో కేసు లేకుండా చేస్తానని అందుకు ఖర్చు అవుతుందని డబ్బులు డిమాండ్ చేయడం జరిగిందన్నారు.

పోలీసు అధికారులు అందరూ తనకు తెలుసని తాను మంత్రి వద్ద పీఏగా పని చేస్తున్నానని చెప్పుకుని, తనకు చాలా పలుకుబడి ఉందని సదరు యజమాని నమ్మించి డబ్బులు డిమాండ్ చేసినట్టు ఏసీపీ తెలిపారు. మంత్రి పీఏగా చెప్పుకుంటున్న మల్లికార్జున్‌పై వాటర్ ప్లాంట్ యజమాని శుక్రవారం మూడో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు.






## పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలి.. మంత్రి అమర్ నాథ్



అమరావతి, జూన్ 25: వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ పార్టీ నాయకులు, కార్య కర్తలకు దిశానిర్దేశం చేశారు. అనకాపల్లి నియోజకవర పార్టీ ప్లీనరి సన్నాహక సమావేశం స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి అమరనాథ్ మాట్లాడుతూ 2024లో జరగనున్న ఎన్నికలకు పార్టీ క్యాడర్ ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఇందుకు తగినట్టుగా అధికారిక యంత్రాంగాని ఆయా ప్రాంతాల్లో నియమించుకోవాలని, అందుకు తన సహాయ, సహకారాలు అందిస్తానాని అమర్ నాథ్ వెల్లడించాలి. వచ్చే ఎన్నికల్లో జగన్ ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత పార్టీ క్యాడర్ పైనే ఉందని అన్నారు. జగన్ అధికార లోకి వచ్చిన మూడేళ్లలో 95శాతం హామిలను నెరవేర్చిన విషయాన్ని మంత్రి అమర్ గుర్తుచేశారు. సంక్షేమ కార్య క్రమాల అమలులో క్షణం ఆలస్యం జరగకుండా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని ఆయన చెప్పారు. పార్టీ పరిశీలకులు రాజారాం మాట్లాడతూ.. గుడివాడ అమర్ మూడు తరాల రాజకీయ అనుభవం ఉందని అన్నారు. అమర్ నిమళ్ళీ గెలిపించుకోడానికి అందరూ కంకణ బద్దులు కావాలని ఆయన కోరారు. కోవిడు కాలంలో కూడా మూఖ్యమంత్రి జగన్ కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిం చారని అన్నారు. ప్లీనరికి ముందు ఏర్పాటు చేసుకునే కమిటీలో మహిళలకు 50 శాతం స్థానం కల్పించాలని ఆయన సూచించారు. మరో పరిశీలకులు, డీసిఎంఎస్ చైర్మన్ ముక్కా మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతు మంత్రి అమరనాథ్ కు మంచి పేరు తీసుకువచ్చేలా పార్టీ కార్య కర్తలు, నాయకులు పని చేయులని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీపు కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ విజయంకోసం సమష్టిగా పనిచేయాలని కోరారు. 2019 లో ప్రజలకు మనం ఏమిచేయకుండానే, ప్రజలు పార్టీకి 151 సీట్లు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో 1,40,000 కోట్ల రూపాయల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన మనకు వచ్చే ఎన్నికలలో 175 కి 175 సీట్లు మన పార్టీకి అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఓటు అడిగే హక్కు రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డికి మాత్రమే వుందని ఆయన అన్నారు

## దళితుల అభ్యున్నతికి పెద్దపీట : మంత్రి గంగుల



కరీంనగర్ : దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కిసాన్‌నగర్, రేకుర్తి గ్రామంలో శనివారం దళితబంధు లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిభాపూలే కన్న కలలను తెలంగాణ ప్రభుత్వం సాకారం చేస్తుందన్నారు. ప్రభుత్వాలు మారినా దళితుల తల రాతలు మారలేదని, గత ప్రభుత్వాలు దళితులను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయని విమర్శించారు.

సమాజంలోని అట్టడుగు వర్గాలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వాలు అనేక నిబంధనలు విధిస్తే.. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు లేకుండా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. గత 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్నారని అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో 13,559 మంది లబ్ధిదారులకు గాను 11,500 మందికి పథకం వర్తింపజేసినట్లు చెప్పారు. కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో 300 మంది లబ్ధిదారులను ఎంపిక కాగా, ఇప్పటి వరకు 250 మందికియూనిట్లు మంజూరు చేశామన్నారు.

యూనిట్ల వనితీరును నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ నియోజకవర్గంలో మంజూరైన వంద యూనిట్లను త్వరితగతిన లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు

. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నియోజవర్గానికి 1500 మంది లబ్ధిదారులను దళిత బంధు పథకానికి ఎంపిక చేయనున్నామని, సోమవారం అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారని వివరించారు. మొదటి ప్రాధాన్యతగా నిరుపేదలను మాత్రమే ఈ పథకానికి ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

మానవతకు మారుపేరు కేసీఆర్ అనీ, దేశంలో ఎక్కడా లేని విధంగా లెక్కకు మించిన సంక్షేమ పథకాలు టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తోందన్నారు.

పేదల సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎక్కడా రాజీపడదన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్ రావు, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, సుడా చైర్ పర్సన్ జీవి రామకృష్ణ రావు, యువ కేంద్ర కో ఆర్డినేటర్ రాంబాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, కార్పొరేటర్లు ఎడ్ల సరిత అశోక్, కంసాని శ్రీనివాస్, నక్క పద్మా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో కొత్తగా 15,940 కరోనా కేసులు

న్యూఢిల్లీ, జూన్ 25: దేశంలో కరోనా కేసులు స్వల్పంగా తగ్గాయి. శుక్రవారం 17 వేలకుపైగా కేసు లు నమోదవగా, నేడు ఆ సంఖ్య 15,940కి తగ్గింది. దీంతో మొత్తం కేసులు 4,33, 78,234కు చేరాయి. ఇందులో 4,27,61 ,481 మంది బాధితులు వైరస్ నుంచి కోలుకోగా 5,24 ,974 మంది మరణించా రు. మరో 91,779 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కాగా, గత 24 గంటల్లో 20 మంది మరణించగా 12,425 మంది డిశ్చార్జీ అయ్యారు. యాక్టివ్ కేసులు లక్షకు చేరువవడంతో యాక్టివిటీ రేటు 0.21 శాతానికి పెరిగింది. రికరీ రేటు 98.58 శాతం, మరణాల రేటు 1. 21 శాతంగా ఉన్నాయని, రోజు వారీ పాజిటివిటీ రేటు 4.39 శాతంగా ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఇక దేశవ్యాప్తంగా 196.94 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని తెలిపింది.

### 42 లక్షల మరణాలను నివారించిన టీకాలు

న్యూఢిల్లీ, జూన్ 25:గత ఏడాది భారత్‌లో దాదాపు 42 లక్షల కరోనా మరణాలను టీకాలు నివారించాయని లాన్సెట్ అధ్యయనంలో తేలింది. టీకా పంపిణీ మొదలైన తర్వాత 2020 డిసెంబర్ 8– 2021 డిసెంబర్ 8 మధ్య భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా మరణాల నివారణపై బ్రిటన్‌కు చెందిన ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ అధ్యయనం నిర్వహించింది.

టీకా పంపిణీ వల్ల ఆ వ్యవధిలో భారత్‌లో 42 లక్షల కరోనా మరణాలను నివారించగలిగినట్టు నివేదిక అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే దాదాపు 2 కోట్ల మంది ప్రాణాలను టీకాలు నిలిపాయని తెలిపింది.

## టీచర్‌పై చెప్పుతో దాడి చేసిన ప్రిన్సిపల్ -సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

న్యూఢిల్లీ, జూన్ 25:ఓ మహిళ ఉపాధ్యాయురాలిపై చెప్పుతో దాడి చేశాడు ఓ ప్రధానోపాధ్యాయుడు. దాంతో ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న ఉన్నతాధికారులు ఆ ఉపాధ్యాయుడిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. సస్పెండ్ చేసి.. ఇంటికి పంపించారు. ఈ ఘటన లఖింపూర్‌లోని సదర్ బ్లాక్‌లో ఉన్న మహంగుఖేడా ప్రాథమిక పాఠశాలలో జరిగింది. ఉపాధ్యాయుల తీరుపై శిక్షామిత్ర సంఘం కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. లఖింపూర్ ఖేరీ లోని మహేంగు ఖేరా అనే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అజిత్ వర్మ ప్రిన్సిపాల్ గా పని చేస్తున్నాడు. అదే పాఠశాలలో సీమ అనే మహిళ టీచర్ గా విధులు నిర్వహిస్తోంది. అయితే.. పాఠశాలకు ఆ మహిళ టీచర్ ఆలస్యంగా వచ్చింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆ ప్రిన్సిపల్.. అందరి ముందే ఆమెపై రెచ్చిపోయాడు. ఇష్టానూసారంగా బూతులు తిట్టాడు. ఆమె ఆ ప్రిన్సిపల్ ను తిట్టింది. సహనం కోల్పోయిన ఆ ప్రిన్సిపాల్ ..తన బూటు తీసుకుని ఆ మహిళ టీచర్ పై దాడి చేశాడు. ఇష్టమొచ్చినట్లు కొట్టాడు.

అక్కడే ఉన్న తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు షాక్ కు గురయ్యారు. ఆ తర్వాత.. ఉపాధ్యాయురాలు కూడా ప్రిన్సిపల్ ను కొట్టింది. మరో ఉపాధ్యాయుడు వారిని అడ్డుకోవడంతో ఆ దాడి అంతటితో ఆగింది. ఈ దాడికి సంబంధించిన వీడియో నెట్టింట్లో వైరల్ కావడంతో విద్యాశాఖ అధికారులు సీరియస్ అయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్.. అజిత్ వర్మను సస్పెండ్ చేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి (బిఎస్ఎ) లక్ష్మీకాంత్ పాండే తెలిపారు. అయితే.. ఈ ఘటనపై ఆ ప్రిన్సిపల్ వాదన మరోలా ఉంది. సదరు ఉపాధ్యాయురాలు రోజు కావాలనే ఆలస్యంగా వస్తుందని, మొదట ఆమెను తనపై చేయి చేసుకుందని వివరణ ఇచ్చాడు. మరోవైపు.. ఈ ఘటనపై ఉపాధ్యాయురాలు స్థానిక పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారే ఇలా కొట్టుకుంటుంటే ఇక ఆ విద్యార్థుల పరిస్థితి ఏంటో.

## వరదనీటి కాలువ పనులు వేగవంతం చేయాలి



హైదరాబాద్, జూన్ 25:వరదనీటి కాలువ పనులను వేగవంతం చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, ఎంఆర్‌డీసీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రూ. 103.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వరదనీటి కాలువల నిర్మాణంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జలమండలి, ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, ప్రాజెక్ట్ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరదనీటి కాలువల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేసి టన్నెలింగ్ పనులను కూడా పూర్తి చేస్తే వరద ముంపు జరుగకుండా ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

మన్సూరాబాద్, సరస్వతినగర్ కాలనీలో వరదకాలువ పనులు కూడా త్వరలోనే టెండర్ జరిగి పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రధాన మార్గాల్లో వరదనీటి కాలువ పనులు సాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ జియాఉద్దీన్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఎన్‌డీపీ చీఫ్ ఇంజినీర్ కిషన్, హయత్‌నగర్ ఉప కమిషనర్ మారుతీ దివాకర్, ఎల్బీనగర్ ఉప కమిషనర్ సురేందర్‌రెడ్డి, సరూర్‌నగర్ ఉప కమిషనర్ హరి కృష్ణయ్య, ఎస్ఈ అశోక్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఎస్ఈ రవీందర్ రాజు, ఈఈ కృష్ణయ్య, డీఈ రోహిణి, ఇరిగేషన్ డీఈ పవన్, జలమండలి జనరల్ మేనేజర్లు బలరాం రాజు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా ప్రభుత్వ పథకాలు

హైదరాబాద్, జూన్ 25: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ హాకీగ్రౌండ్‌లో దళితబంధు లబ్ధిదారులకు కార్లు, ఆటోలను ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్‌రావు ఎమ్మెల్యే జాఫర్‌మెరాజ్ హుస్సేన్, టీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి అందజేశారు.

ఈ సందర్భంగా ఎంఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. దళితబంధు పథకం దేశంలో ఎక్కడాలేదని, కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే అమలులో ఉందన్నారు. ఇప్పటికే వేలాది మంది ఈ పథకంలో లబ్ధి పొందారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్ హుస్సేన్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దళితబంధు పథకం అమలుతో లబ్ధిదారుల్లో సంతోషం కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఎస్సీ కార్పొరేషన్ అధికారులతోపాటు టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్, ఎంఐఎం కార్పొరేటర్‌ల ప్రతినిధులు జాఫర్‌ఖాన్, ఎండీ.మూసా, సర్ఫరాజ్ సిద్ధిఖీ, టీఆర్ఎస్ నాయకులు సంజయ్, లక్ష్మీనారాయణ, యూసుఫ్, మెట్టువాల్మీకి, మాజీద్, ధరంవీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.




# రాఖీ

"ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పి.వి. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటికూడా మూలరూపాలు... లేకపోలేదు" అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...

– సంపాదకులు.






– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

**21**

**ఆ రోజు రాఖీ పౌర్ణమి. మానస పిల్లల్ని తీసుకొని పొద్దున్నే మనోజ్ అన్నయ్య ఇంటికి బయల్దేరింది. ఇంటికి చేరేసరికి వదిన విశాల తాను రాఖీ కట్టడానికి అన్నయ్యల దగ్గరికి వెళ్లడానికి రెడీ అయి ఆడప డుచు రాకకోసం ఎదురు చూస్తోంది. మధ్యాహ్నామయింది. మానస రాకముందే వెళ్తే నొచ్చుకుంటుంది. మర్యాద కాదు అని గడియ గడియకు ఎదురు చూస్తోంది.**

రాఖీ పౌర్ణమి అన్నా చెల్లెల్ల పండుగ. అక్కలు, చెల్లెల్లు, అన్నలకు, తమ్ముల్లకు రక్షాబంధనం కట్టే రోజు. కొందరు జంధ్యాలు వేసుకునే పండుగ. జంధ్యాల పౌర్ణమి ఇటీవల కాలంలో రాఖీ పౌర్ణమిగా ప్రాచుర్యం పొందింది.

కారు దిగీ దిగగానే పిల్లలు మామయ్యా అంటూ ఇంట్లోకి పరిగెత్తారు. కాళ్ళు చేతులు కడుక్కొని హాల్లో సోఫాలో కూర్చుంది మానస. విశాల ఆడపడుచు మానసకు కుంకుమ పెట్టింది. చెంపలకు పసుపు రాసింది.

అన్నా చెల్లెల్ల పిల్లలు కలిసి ఇళ్ళంతా సందడి. ఆటలు... గోల... మానస తెచ్చిన రాఖీని అన్నయ్య కుడి చేతికి కట్టింది. కుంకుమ పెట్టింది.

పిల్లలు పరస్పరం లాక్కోవడంతో వారి చేతుల్లోంచి ఫ్లవర్‌వాజ్ కిందపడి పగిలిపోయింది. గాజు ముక్కలు చూసి ఏడుపు అందుకున్నారు. ఉన్న చోట ఒక్కకాడ ఉండరు కదా! అని విసుక్కుంటూ మానస పాత గుడ్డపీలిక తెచ్చి జాగ్రత్తగా దగ్గరికి కుప్ప చేసి ఎత్తి చెత్తలో పోసివచ్చింది.

అంతదాకా పిల్లలు బిక్కుబిక్కుమంటూ వున్న వాళ్లల్లా మళ్లీ నవ్వారు. అమ్మ కాళ్ళ చుట్టూ వాటేసుకున్నారు. వాళ్లకి చెరో పప్పీ ఇచ్చి ఆడుకోమంది.

"అన్నయ్యా! వదినా! వచ్చే నెలలో చిన్నూ పుట్టివెంట్రుకలు తీయిద్దామనుకుంటున్నాము. నువ్వే కదా తీయాల్సింది. తప్పకుండా రావాలి'' అంది మానస. మేనమామలు పుట్టువెంట్రుకలు కత్తిరించడం సాంప్రదాయం.

"అలాగే" అన్నాడు మనోజ్.

అప్పటికే రెడీ చేసిన వదిన విశాల అందరికీ పాయసం అందించింది.

కాసేపటికి "మరి నేను మా అన్నయ్యల దగ్గరికి పోవాల్నా..." అని అడిగింది విశాల.

కొత్తచీర, జాకెట్ పీసుల జత, పండ్లు, టవల్‌తో పాటు కొంత నగదు స్టీల్ తాంబూళంలో పట్టుకొని వచ్చింది విశాల.

మనోజ్ వాటిని చెల్లెలు ఒడిలో పెట్టి చెల్లెలు పాదాలకు నమస్కరించాడు. విశాల మనోజ్‌ను అనుసరించి ఆడపడుచు పాదాలు స్పర్శించింది. మానస వారిని లేవనెత్తింది. వదినను దీవించింది.

"అందరికీ వంట చేశాను. రాఖీ కట్టడానికి ఇక మా అన్నయ్య దగ్గరికి బయల్దేరతా!" అంది విశాల.

సరేనంది ఆడపడుచు మానస.

అన్నా, చెల్లెల్లు అనేక విషయాలు ముచ్చటించు కున్నారు. బాల్యాన్ని జ్ఞాపకం చేసుకున్నారు.

×××

వేములవాడ రాజరాజేశ్వస్వామి దేవాలయంలో సోమవారం, శనివారం భక్తుల తాకిడి ఎక్కువ. సోమవారం ఆర్డీవో సుధాకర్, మానసల కూతురు కేశ ఖండనం. ఆదివారం రాత్రి సుధాకర్ తల్లిదండ్రులు రాజయ్య, బుచ్చవ్వలతో సహా వేములవాడకు చేరుకున్నారు.

రామచంద్రయ్య కుటుంబం, ఎంఈవో సత్తయ్య దంపతులు, మరికొందరు అదే రాత్రి చేరుకున్నారు. గెస్ట్ హౌస్‌లో మకాం చేశారు. ఎంఈవో సత్తయ్య ఏర్పాట్ల వ్యవహారం భుజాన వేసుకున్నాడు.

జయ, విజయేందర్ కుటుంబాలతో సహా వేములవాడ విచ్చేశారు. వారు తమ వసతి ఏర్పాట్లను స్వయంగా చూసుకున్నారు.

ఉదయం మరికొందరు వచ్చారు.

రామచంద్రయ్య, మాధవి తమ పిల్లలకు కేశఖండనం చేయించిన జ్ఞాపకాలు కలిసి పంచుకున్నారు. మనోజ్, మానస, మనోహర్ ఎప్పుడో తన చిన్నప్పుడు తన పుట్టు వెంట్రుకలు తీసిన నాటి గుర్తులు గుర్తు చేసుకున్నారు. అప్పటికీ ఇప్పటికీ ఎన్ని మార్పులు వచ్చాయో ఎంత రష్ పెరిగిందో ముచ్చటించుకున్నారు. గెస్ట్‌హౌస్‌లోనే స్నానాలు ముగించుకొని కోనేటిలోని నీళ్లను తలమీద చిలకరించుకొని గుళ్లో దర్శనం గావించుకొని కళ్యాణకట్టలో కేశ ఖండన టిక్కెట్ తీసుకొన్నారు. ఆర్డీవో కావడం వల్ల రాజలాంఛనాల వలె దేవస్థాన ఉద్యోగులు, పూజారులు గౌరవించారు. చకచకా పనులన్నీ తొందరగా సాగాయి.

మనోజ్ పుట్టు వెంట్రుకలు కత్తిరించాడు. తరువాత మంగలి పుట్టు వెంట్రుకలు తీశాడు. చిన్నూపై వున్న షర్టు, నిక్కరు కూడా మంగలి తీసేసుకున్నాడు. బుద్ధిగా కూర్చున్న చిన్నూను చూసి అందరూ సంతోషపడ్డారు. ఎంతో ఏడుస్తాడని భయపడ్డారు. గుండు చేత్తో పునుక్కొని అయ్యో... లేవు... లేవు... అంటూ ఏడుపు మొఖం పెట్టాడు.

"మళ్ళీ వస్తాయోయ్" అంటూ నవ్వాడు రామచంద్రయ్య. కూతురు పిల్లలను అరేయ్, తురేయ్ అని పిలవకూడదని సాంప్రదాయం.

మానస అత్తా, మామలు రామచంద్రయ్య దంపతులు మనవడికి, అల్లుడు బిడ్డకు పెట్టిన కట్నాలతో సంతోష పడ్డారు. మనవడిని ఎత్తుకొని గారాబం చేశారు.

"మా చిన్నప్పుడు వేములవాడ మొక్కులకు నడిచిపోతుంటిమి. కొండగట్టు కాడ ఆగి వంట చేసుకొని తిని మల్లా బయలుదేరుతుంటిమి. పూదూరు, కొడిమ్యాల, నల్లగొండ మీదినుంచి నాంపల్లి... వాగుల నడుమ కుంట వేములవాడ చేరుతుంటిమి. పోయి వచ్చుటానికే నాలుగు రోజులు పడుతుండె" అంటూ బస్సులు ఎక్కకుండా నడిచిపోయిన వెనుకటి దినాలను గుర్తుచేశాడు సుధాకర్ తండ్రి రాజయ్య.

అలా ఎప్పటెప్పటి విషయాలో ముచ్చటించుకున్నారు. వేములవాడ దేవాలయం మునుపు ఇలా వుండేది కాదని అంతా కొత్తగా మార్చిన్రని చర్చించుకున్నారు. "వెనుకట గుడిలో ముఖద్వారం దాటంగనే కుడిపక్కకు జైన మహా వీరుని విగ్రహం ఉంటుండె. అది ఇపుడు భీమన్న గుడిలో ఎక్కన్నో పడేసిన్రు. అసలు ఇది మొదట్లో జైన దేవాలయమేనట. 11వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో శివాలయంగా మార్చిన్రట" అంటూ చరిత్ర చెప్పుకొచ్చాడు ప్రిన్సిపాల్ రామచంద్రయ్య.

"మొదట్లో భీమన్న గుడే ప్రాచుర్యంలో ఉండేదట. ఎందుకో ఇప్పుడు కొత్త గుడి ప్రాచుర్యంలోకి వచ్చింది" అన్నాడు ఆర్డీవో వెంకటేశం. వాళ్ల ముచ్చట అట్ల సాగుతుంటే, ఆడవాళ్లు పిల్లల గురించిన ముచ్చట్లు యాది చేసుకున్నారు.

"ధర్మపురికి గంగతీర్థంకు పోయినపుడు సుధాకర్‌గాడు కొద్దిలో అయితే నీళ్ళల్లో కొట్టుకపోతుండె. ఎంత చెప్పినా లోతుకు పోకురా అంటే ఈతవస్తది కదా అని పోయిండు. ఎవరో చేయి పట్టుకొని గుంజకచ్చిన్రు" అంది సుధాకర్ తల్లి బుచ్చవ్వ. మానస సుధాకర్‌కేసి చూసి నవ్వింది. చిన్నప్పటినుంచి సాహసాలేనా అన్నట్టు... "చిన్నప్పుడు మనోహర్ గాడు పుట్టువెంట్రుకలు తీస్తే ఎంత ఏడ్చిండో!" అంటూ గుర్తు చేసుకుంది మాధవి. ఢిల్లీనుండి మనోహర్ రాకపోవడాన్ని అందరూ గుర్తు చేశారు. కొందరు తప్పు పట్టారు.

ఆదివారం చూసుకొని కేశఖండనం సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు. అదే సందర్భంగా సత్యనారాయణ స్వామి పూజ కూడా పెట్టుకున్నారు. దగ్గరి వాళ్ళందర్నీ ఫోన్‌లో ఆహ్వానించారు. వందమందికి పైగా వచ్చారు.

# లాల్‌దర్వాజ అమ్మవారి బోనాలకు సన్నాహాలు



హైదరాబాద్, జూన్ 25: లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ శీరా రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోనాల సందర్భంగా జూలై 3న 150 మంది కళాకారుల బృందంతో కలిసి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరో 60 మంది ఢిల్లీ బయలుదేరుతామన్నారు. 4న విలేకరుల సమావేశం, 5 న అమ్మవారి చరిత్రకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమం, 6న 108 మంది మహిళ భక్తులతో ఢిల్లీ గేటు నుంచి తెలంగాణ భవన్ వరకు బోనాల వండుగ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూలై 15 న లాల్‌దర్వాజ అమ్మవారి ఆలయం శిఖర పూజ, ధ్వజారోహణతో ప్రారంభమై జూలై 25 న అష్టదశపాద పద్మారాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.మాణిక్‌ప్రభుగౌడ్, కె.విష్ణుగౌడ్, బంగ్లా రాజు యాదవ్, బి.మారుతి యాదవ్, సి.వెంకటేష్, బి.బల్వంత్ యాదవ్, తిరుపతి నర్సింగ్‌రావు, బద్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

నెల రోజులుగా లాల్‌దర్వాజ అమ్మవారి ఆలయ కమిటీ పేరుతో రెండు గ్రూపులుగా విడిపోయి కమిటీలు ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు రాజ్‌కుమార్ బృందం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన గంటలోపే పోసాని సదానంద్ ముదిరాజ్ గ్రూపు కమిటీ సభ్యులు మా పర్యవేక్షణలోనే బోనాలు జరుగుతాయని విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి స్పష్టం చేశారు. నూతన కమిటీలో ఆలయ చైర్మన్‌గా చెన్నబోయిన శివకుమార్ యాదవ్, వర్కింగ్ చైర్మన్‌గా పి.సురేందర్ కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగే ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. అందరూ కలిసి కట్టుగా బోనాలు నిర్వహించాలంటే రెండు కమిటీలు రద్దు చేసి ఫోర్‌మెన్ కమిటీ వేస్తే కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు సదానంద్ ముదిరాజ్ వర్గం స్పష్టం చేసింది. ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండేందుకు ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలాని పర్యవేక్షణలో ఎస్సై మహేశ్ బృందం బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఢిల్లీ ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌కి - అరుదైన ఘనత

న్యూఢిల్లీ, జూన్ 25:దేశంలో తొలి పూర్తిస్థాయి హైడ్రో,సోలార్ పవర్ ఎయిర్ పోర్టుగా గుర్తింపుని దక్కించుకుంది ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ..ఈ విమానాశ్రయం గతేడాది దేశంలోనే కాకుండా మధ్య ఆసియాలోకెల్లా ఉత్తమ విమానాశ్రయంగా గుర్తింపు పొందింది. ఇందిరాగాంధీ ఎయిర్ పోర్టులో గత కొంతకాలంగా అన్ని కార్యకలాపాలు హైడ్రో, సోలార్ శక్తితోనే నడుస్తున్నాయి. తాజా ఘనతపై ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ స్పందించింది. 2030 నాటికి పునరుత్పాదక ఇంధన శక్తి సహితంగా, పూర్తిస్థాయి కర్బన ఉద్గార రహిత విమానాశ్రయంగా మార్చాలన్న లక్ష్యంలో ఇది కీలక ముందడుగు అని అభివర్ణించింది. రెండు లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించింది. ఇందిరాగాంధీ విమానాశ్రయానికి హైడ్రో ఎలక్ట్రిసిటీ సరఫరా చేసేందుకు ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ హిమాచల్ ప్రదేశ్ కు చెందిన ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం 2036 వరకు అమల్లో ఉంటుంది.

# రాజమండ్రిలో హామ్ రేడియోపై విద్యార్థులకు అవగాహన

అమరావతి, జూన్ 25: తూర్పు గోదావరి జిల్లా : రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు హామ్ రేడియోపై అకాడమీ ఆఫ్ హామ్ రేడియో అవగాహన కల్పించింది. చీఫ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఏ రమేశ్ బాబు ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో హామ్ రేడియో అవగాహన కార్యక్రమంలో రమేశ్ బాబు ప్రసంగించారు.

హామ్ అమెచ్యూర్ మెకానిక్ రేడియో ఆవిర్భావం, దాని చారిత్రక నేపథ్యం గురించి రమేశ్ బాబు వెల్లడించారు. అత్యాధునిక టెక్నాలజీ, సెల్ ఫోన్ల ప్రపంచంలో హామ్ రేడియోకు ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో సమాచారాన్ని చేరవేయడంలో హామ్ రేడియో సేవలు ఘనణీయమైనవని కొనియాడారు. విపత్తుల సమయంలో ప్రభుత్వం సమాచార వ్యవస్థను నిర్వహిస్తుందని చెప్పారు.తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా తదితర సముద్ర తీర ప్రాంతాల్లో విపత్కర పరిస్థితుల్లో హామ్ రేడియో అందిస్తున్న సేవలను తన సొంత అనుభవాలతో కలిపి రమేశ్ బాబు వివరించారు. జాతీయంగా, అంతరాతీయంగా హామ్ రేడియో సాంకేతికతను ఉపయోగించడంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం జగన్నాధరావు.. రమేశ్ బాబుకు జ్ఞాపికను అందజేసి అభినందించారు. క్యాంపస్‌లో హామ్ రేడియో ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని యూనివర్సిటీ అధికారులకు వీసీ సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో రిజిస్ట్రార్ టీ అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ పెర్సిస్, కన్వీనర్ జే హనుమంతు, కో-కన్వీనర్లు డాక్టర్ డీ శ్రీనివాసరావు, డాక్టర్ డీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణం కోసం మట్టి గణపతి



హైదరాబాద్, జూన్ 25:మానవ మనుగడ పచ్చదనంతో అల్లుకుని ఉన్నదని ఆరోగ్యంగా జీవించేందుకు ఆహ్లాదకరమైన ప్రకృతి అవసరమని అందుకోసం మొక్కలు నాటాలని.. కాలుష్య రహిత వేడుకల కోసం మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ అన్నారు. ప్రస్తుత తరాలతో పాటు భావి తరాల కోసం ఈ ప్రకృతి ఉద్యమాన్ని దిగ్విజయంగా చేపట్టాలన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల మహిళలకు అవగాహనతో పాటు.. వినాయక ఉత్సవాలకు మట్టి గణపతుల వినియోగంపై జోనల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో జడ్సీ శంకరయ్య, డీసీలు వెంకన్న, నందగిరి సుధాంశ్, జిల్లా వైద్యాధికారి స్వరాజ్య లక్ష్మిలతో కలిసి విప్ గాంధీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం మొక్కలు నాటడం వరకే కాకుండా.. వాటిని సంరక్షించుకోవాలని, పొదుపు సంఘాల మహిళలు ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఖాళీ స్థలాలన్నింటా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ నిమిత్తం ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను సైతం అందిస్తున్నదని, సద్వినియోగం చేసుకుని హరితహారాన్ని విజయవంతం చేయాలని విప్ గాంధీ కోరారు. ఈ సారి ఉత్సవాలలో పీవోపీ విగ్రహాలకు అనుమతి లేదని, ప్రతి ఇంటా మట్టి గణపతినే పూజించాలని గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ సృజన, అధికారులు అనీల్‌కుమార్, మాన్సి, ఉషారాణి, డాక్టర్ నగేశ్ నాయక్, యూసుఫ్, చంద్రారెడ్డి, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ అలింకో సంస్థల సంయుక్తంగా దివ్యాంగులకు, వృద్ధులకు ఉచితంగా ఉపకరణాల వంపిణీకి సంబంధించి నిర్వహించనున్న ఎంపిక గుర్తింపు శిబిరం పోస్టర్‌ను జడ్సీ శంకరయ్య, డీసీలు వెంకన్న, నందగిరి సుధాంశ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మితో కలిసి విప్ గాంధీ జోనల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఈ నెల 30న శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయ మీటింగ్‌హాల్‌లో, జూలై 1న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్యాణ మండపంలో శిబిరాలను నిర్వహిస్తారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తగు ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పలు డివిజన్లకు చెందిన దరఖాస్తుదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ. 6.10 లక్షల ఆర్థిక సాయం మంజూరు పత్రాలను విప్ గాంధీ గురువారం తన నివాసంలో లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, శ్రీనివాస్, కాశీనాథ్ పాల్గొన్నారు.

గచ్చిబౌలి ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా మీనాక్షిటవర్స్ నుంచి రోడ్డు విస్తరణను 200 ఫీట్ల నుంచి 150 ఫీట్లకు తగ్గించటాన్ని హర్షిస్తూ పీజేఆర్‌నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు విప్ గాంధీని ఆయన నివాసంలో కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చాంద్‌పాష, కైలాశ్ సింగ్ అచ్చేశ్వర్‌రావు, దుర్గాప్రసాద్, షౌకత్, రంగారావు, సంకేష్, కృష్ణ, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తెమట్టెలు అందజేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

హైదరాబాద్, జూన్ 25:నిరుపేద ఓసీ ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన పెళ్లికూతురు వివాహానికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పుస్తెమట్టెలు అందజేశారు. ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బోడుప్పల్ నివసిస్తున్న ఆర్యవైశ్య కులానికి చెందిన ధీన పరిస్థితిలో ఉండి రోజువారి కూలీ పని చేసుకొనే యెర్రం జ్యోతి కీ.శే. నర్సింగరావుల కూతురు వైష్ణవి వివాహానికి నాగోల్ లోని తన కార్యాలయంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా పుస్తెమట్టెలు, చీర, గాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.విశ్వేశ్వర్, మహేష్, నరేష్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హైదరాబాద్, జూన్ 25:రూ. 15 కోట్ల 7లక్షల 54వేల నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్ అఫందీ

చార్మినార్, జూన్ 24 : పాతనగరంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సుడిగాలి పర్యటన చేశారు. శుక్రవారం ఆయన యాకుత్‌పురా నియోజకవర్గంలోని పలు డివిజన్లలో సీవరేజీ, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 15 కోట్ల 7లక్షల 54వేల నిధులతో డబీర్‌పురా, తలాబ్‌చంచలం, రెయిన్‌బజార్, కుర్మాగూడ, సంతోష్‌నగర్, ఐఎస్ సదన్ డివిజన్లలో వరదముంపును తప్పించేందుకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ఎంపీ శంకుస్థావన చేశారు. వనులను వెనువెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్ అఫందీ పాల్గొన్నారు.

:ప్రజలకు డ్రైనేజీ సమస్యలు లేకుండా డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకి డివిజన్‌లో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి మహ్మద్‌హరూన్ ఫర్హాన్‌తో కలసి పరిశీలించారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలను కల్పించడానికి చేపడుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్‌మెరాజ్ హుస్సేన్ అన్నారు.








# తిరుమలలో భక్తుల రద్దీ.. శ్రీవారి దర్శనానికి 15 గంటల సమయం..



తిరుమల, జూన్ 25: కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తిరుమలలో భక్తుల తాకిడి కొనసాగుతుంది. తిరుమలలోని అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆస్థాన మండపం వరకు భక్తులు క్యూలో నిలుచున్నారు. వీరికి దర్శనం 15 గంటల వరకు అవుతుందని టీటీడీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా నిన్న శ్రీవారిని 71,589 మంది భక్తులు దర్శించుకోగా 41,240 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.30 కోట్లు వచ్చిందని తెలిపారు.

# ఏపీ మంత్రి ఆదిమూలపు సురేశ్‌కు మరోసారి అస్వస్థత

అమరావతి, జూన్ 25: ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి, మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. ప్రకాశం జిల్లా మర్కాపురంలోని తన కళాశాలలో ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కిందపడిపోయారు. సమాచారం అందుకున్న వ్యక్తిగత వైద్యులు హుటాహుటిన కళాశాలకు చేరుకుని మంత్రికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

బీపీ కారణంగానే కిందపడినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం కళాశాలలోనే విశ్రాంతి తీసుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. పదిరోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేరగా మంత్రికి వైద్యులు స్టెంట్లు వేసి చికిత్స చేశారు.

# గ్రీన్ ఇండియా చాలెంజ్.. మొక్కలు నాటిన వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి



హైదరాబాద్, జూన్ 25:ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ అప్రతిహతంగా కొనసాగుతున్నది. ఇందులో భాగంగా తన కుమారుడు కేసీఆర్ ఆరో జన్మదినాన్ని పురస్కరించుకుని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి మొక్కలు నాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ రథసారథి, సీఎం కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో తమ కుమారుడికి ఆయన పేరు పెట్టుకున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు, భావితరాల కోసం ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటామని, కార్యక్రమం గొప్పతనాన్ని తన కుమారుడికి తెలియజేశానని చెప్పారు.

# వైసీపీ పార్టీ ఉగ్రవాద శిక్షణా కేంద్రం-కులగజ్జి ఎక్కువ- కమెడియన్ పృథ్వీరాజ్

అమరావతి, జూన్ 25: వైసీపీ పార్టీ ఉగ్రవాద శిక్షణా కేంద్రమని కమెడియన్ 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కాలంలో కాంట్రవర్సీ లకు గురి అవుతున్నాడు ఈయన. ఇకపోతే వైసీపీలోకి చేరిన తరువాత పృథ్వీరాజ్ టీ డీ పీ పార్టీని ఎన్నోరకాలుగా తన మాటలతో విమర్శించిన విషయం తెలిసిందే.

కానీ ఇప్పుడు తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న పృథ్వీరాజ్ వైసిపి పార్టీ ఒక ఉగ్రవాద శిక్షణ కేంద్రం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. వైసిపి పార్టీ గురించి తాను ఎదుర్కొన్న ఇబ్బందులను గురించి వెల్లడించారు. వైసిపి పార్టీలో కులగజ్జి ఎక్కువగా ఉంది అని.. ఒకవేళ నా పేరు వెనుక రెడ్డి అని ఉన్నా కూడా నేను అక్కడే ఉండి పోయే వాడినేమో.. నా పేరు వెనుక రెడ్డి లేదు కాబట్టి నాకు అంత గౌరవం ఇవ్వలేదు అంటూ ఆయన తెలిపారు.

నిజానికి పృథ్వీరాజ్ రాజకీయాలలో అంత బాగా వైరల్ అవడానికి కారణం వైసీపీ పార్టీలో ఉన్నప్పుడు ప్రత్యర్థుల పార్టీల గురించి నోటికొచ్చినట్లు మాట్లాడటమే కాకుండా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, చిరంజీవి వంటి వారి పై దారుణంగా తన మాటల తూటాలు విసిరారు. ఇక తన స్థాయికి మించి ఆయనను ఎస్ వి బి సి చైర్మన్ చేశారు . కానీ ఒక మహిళ ఉద్యోగితో వెనుక నుంచి పట్టుకుంటే అంటూ అసభ్యకరమైన ఫోన్ కాల్స్ బయటకు రావడంతో పదవి నుంచి తొలగించడం జరిగింది. అప్పటి నుంచి పృథ్వీరాజ్ ను పార్టీ నుంచి పక్కన పెట్టడం.. పార్టీ కార్యక్రమాలకు పిలవకపోవడం.. ఇలా పూర్తిగా దూరం పెట్టారు. ప్రస్తుతం 2024లో వచ్చేఎన్నికలలో జనసేన పార్టీలోకి చేరబోతున్నట్లు తెలిపారు పృథ్వీరాజ్.

# ఏపీఎల్‌కు క్రికెటర్ల వేలం.. 120 మందికి దక్కిన అవకాశం




విశాఖపట్నం, జూన్ 25: : శ్రీరామ్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) ఆటగాళ్ల వేలం విశాఖపట్నంలో నిర్వహించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వేలం పాటను నిర్వహించి 120 మంది స్థానిక క్రికెటర్లకు అవకాశాలు కల్పించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున వేలం కార్యక్రమాన్ని చారు శర్మ ఎటువంటి అవాంతరాలు లేకుండా నిర్వహించారు. ఆటగాళ్లకు ఇచ్చిన క్యాటగిరీ ప్రకారం బిడ్డింగ్ నిర్వహించగా.. ఫ్రాంచైజీలు పోటాపోటీగా పాల్గొన్నారు. ఫ్రాంచైజీలు ఇచ్చిన నామినేషన్ ప్రకారం ఏ, బీ, సీ క్యాటగిరీలవారీగా ఆటగాళ్ల వేలం పూర్తిచేశారు. వచ్చే నెల 6 వ తేదీ నుంచి మినీ ఐపీఎల్‌గా పిలుచుకునే ఏపీఎల్ ప్రారంభం కానున్నది.

ఐకాన్ ప్లేయర్‌లకు బేస్ ధర రూ. 1.5 లక్షలు, క్యాటగిరీ ఏ కి రూ. 1 లక్ష, క్యాటగిరీ బీ కింద రూ. 50,000, క్యాటగిరీ సీ కింద రూ. 25,000 గా నిర్ణయించారు. ఆరు ఫ్రాంచైజీలు దాదాపు 120 మంది క్రికెటర్లను ఎంపిక చేసుకున్నాయి. కాగా, నెల్లూరుకు చెందిన అశ్విన్ హెబ్బార్‌కు అత్యధిక ధర రూ. 8.7 లక్షలుగా బిడ్డింగ్ వచ్చింది. హెబ్బార్ ఆంధ్ర రంజీ జట్టు సభ్యుడిగా ఉన్నారు. అతడ్ని వేలంలో వైజాగ్ వారియర్స్ సొంతం చేసుకున్నది. కాగా, రికీ భుయ్ రూ. 8.1 లక్షలకు బెజవాడ టైగర్స్, వెంకట శశికాంత్ రూ. 6.1 లక్షలకు గోదావరి టైటాన్స్, గిరినాథ్ రెడ్డి రాయలసీమ కింగ్స్ , కే వెంకట శశికాంత్‌ను గోదావరి టైటాన్స్ రూ. 6.1 లక్షలు, కే శ్రీకర్‌ను భారత్ రూ. 6 లక్షలకు ఉత్తరాంధ్ర లయన్స్ దక్కించుకున్నాయి.

వేలం పాటలో ఏసీఏ సీఈవో ఎం శివారెడ్డి, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు జీవీవీ గోపాలరాజు, జగన్నాథ రావు, నాగేశ్వర్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఏసీఏ కోశాధికారి, పాలక మండలి సభ్యుడు గోపీనాథ్ రెడ్డి ఫ్రాంచైజీ యజమానులకు, చారు శర్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ప్రారంభ ఎడిషన్ జూలై 6 నుంచి 17 వరకు కొనసాగనున్నది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు 27 ఫ్రాంచైజీ ఎంట్రీలు వచ్చాయి. తొమ్మిదింటిని షార్ట్‌లిస్ట్ చేయగా.. ఆరు ఫ్రాంచైజీలు బిడ్‌ను గెలుచుకున్నాయి. ప్రతి జట్టులో 20 మంది ఆటగాళ్లు, నలుగురు సహాయక సిబ్బంది ఉంటారు. ఏపీఎల్ అధికారిక స్పాన్సర్‌గా శ్రీరామ్ గ్రూప్ వ్యవహరిస్తున్నది.

# సరికొత్త రోడ్లకు శ్రీకారం

హైదరాబాద్, జూన్ 25: సరికొత్త రోడ్ల నిర్మాణానికి పలు జిల్లాల్లో శ్రీకారం చుట్టారు. తక్కువ ఖర్చు, నాణ్యత ఎక్కువగా ఉండేలా వీటిని నిర్మిస్తున్నారు. కొబ్బరి పీచు, జౌళితో తయారు చేసిన మ్యాట్ (కాయిర్)ను ఉపయోగించి జియోటెక్స్‌టైల్ టెక్నాలజీతో ఇంజినీరింగ్ అధికారులు ప్రయోగాత్మకంగా చేపట్టారు. కామారెడ్డి, కరీంనగర్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 121 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నారు. కాగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పోతారం (ఎస్) నుంచి నాగారం మీదుగా ఉమ్మాపూర్ గ్రామం వరకు 3.64 కిలోమీటర్ల మేర ఈ కొత్త విధానంతో రోడ్డును నిర్మిస్తున్నారు.

ఇందుకుగాను రూ. 2.31 కోట్లు మంజూరయ్యాయి. జియోటెక్స్‌టైల్ టెక్నాలజీతో నిర్మించే రోడ్లు నాణ్యతతోపాటు నిర్మాణ వ్యయం చాలా తక్కువగా ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

జియోటెక్స్‌టైల్ టెక్నాలజీ ద్వారా రోడ్డు నిర్మాణానికి గాను మొదట రోడ్డుపై మొరం పోసి రోలింగ్ చేస్తారు. అనంతరం కొబ్బరి పీచుతో తయారు చేసిన కాయిర్ (మ్యాట్)ను అమర్చుతారు. దానిపై గ్రాన్యులర్ సబ్‌బేస్ (కంకర డస్ట్) వేసి రోలింగ్ చేస్తారు. వెట్ మిక్స్ (40 ఎంఎం, 20 ఎంఎం, 12 ఎంఎం, 4 ఎంఎం చిప్స్, డస్ట్ కలిపి) వేసి మళ్లీ రోలింగ్ చేస్తారు. ఆ తర్వాత బీటీ రోడ్డు వేస్తారు. సాధారణంగా 7 ఇంచుల మందంతో రోడ్డు వేయాల్సి ఉంటుంది. కానీ, కొత్త టెక్నాలజీతో కేవలం 5 ఇంచుల ఎత్తు మాత్రమే వేస్తారు. తద్వారా ఖర్చు ఆదా అవుతుంది. మొరంపై వేసిన కాయిర్ కొన్ని రోజుల వరకు బీటీకి నీరు చేరకుండా అడ్డుకుంటుంది. దీంతో బీటీ రోడ్డు అంత తొందరగా దెబ్బతినే అవకాశం ఉండదు. అయితే కొబ్బరి పీచు కాయిర్ మట్టిలో కలిసిపోయినప్పటికీ మొరానికి బీటీకి మధ్య గట్టిదనం ఏర్పడి రోడ్డు నాణ్యతతో ఎక్కువ రోజులు ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

# యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు- ఎస్పీ రాహుల్ హెగ్డే



కరీంనగర్ , జూన్ 25(నేటినిజం ప్రతినిధి): యువత డ్రగ్స్ కు బానిసలు కావద్దని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన కరపత్రాలను రాహుల్ హెగ్డే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ కు బానిసలు కావద్దని సంతోషం తో మొదలై జీవితాలు విషాదంతో అంతమవుతాయి అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన పట్ల అనునిత్యం దృష్టి పెట్టాలని ప్రవర్తనలో మార్పులను గమనించాలని సూచించారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ పట్ల కలిగే దుష్పరిణామాల పై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ యువతలో అవగాహన కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ పుణ్యం చందర్. హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అల్వాల ఈశ్వర్. న్యాయవాది కనుకుంట్ల తిరుమల పట్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న అపోలో చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి

హైదరాబాద్, జూన్ 25:యంగ్ డాక్టర్స్ లీడర్‌షిప్ సదస్సులో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డికి ఈరోజు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. భారతదేశంలో ప్రైవేట్ రంగంలో ఆరోగ్య సంరక్షణకు మార్గదర్శకత్వం వహించిన డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డిని ఆధునిక భారతీయ ఆరోగ్య సంరక్షణ రూపశిల్పిగా ఈ అవార్డు నిలపడంతో పాటు ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణను ప్రతి భారతీయుడికి అందుబాటులోకి తీసుకురావడంలో ఆయన చేసిన అసమానమైన కృషిని గుర్తించింది. డాక్టర్ రెడ్డి ప్రయత్నాల ఫలితంగా, భారతదేశం నేడు క్లినికల్ ఫలితాలను అభివృద్ధి చెందిన దేశాలతో సరిసమానంగా, కొన్ని సమయాల్లో ప్రపంచ ప్రమాణాల కంటే మెరుగ్గా అత్యంత అధునాతన ఆరోగ్య సంరక్షణను అందించేవాటిలో ఒకటిగా నిలిచింది.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తమిళనాడు స్టేట్ బ్రాంచ్ (ఐఎంఏ, టిఎన్ఎస్‌బి), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ (ఐఎంఏ జెడిఎన్), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మెడికల్ స్టూడెంట్స్ నెట్‌వర్క్ తమిళనాడు (ఎంఏ ఎమ్ఎస్ఎన్ టిఎన్) ఆధ్వర్యంలో జరిగిన వరల్డ్ యంగ్ డాక్టర్స్ డే సందర్భంగా ఈ అవార్డును అందించారు. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాణ్యమైన, అత్యాధునిక ఆరోగ్య సంరక్షణపై పాశ్చాత్య దేశాలతో సరిసమానంగా అత్యుత్తమమైన క్లినికల్ ఎక్సలెన్స్‌ను అందరికీ చవకగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తన నిరంతర దార్శనికతకు గాను ఈ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వచ్చింది. అధునాతన వైద్య విధానాల కోసం రోగులు విదేశాలకు వెళ్లాల్సిన తరుణంలో ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణను అందించడం డాక్టర్ రెడ్డి దూరదృష్టితో కూడిన దృక్పథం.

# బీసీ విద్యార్థులకు హార్వర్డ్ పాఠాలు : బుర్రా వెంకటేశం



హైదరాబాద్, జూన్ 25:బీసీ గురుకులాలు, హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థుల చెంతకు ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయం హార్వర్డ్ పాఠాలు బోధించనున్నారు. బీసీ సంక్షేమ శాఖ, ఉస్మానియా యూనివర్సిటీ, హార్వర్డ్ యూనివర్సిటీ సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించనున్నాయి. ఈ మేరకు హార్వర్డ్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డొమినిక్ మావో.. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మల్లేశం, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను శనివారం కలిసి తమ ప్రతిపాదన తెలిపారు. వచ్చేఏడాది జనవరి నుంచి బీసీ విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ల ద్వారా తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్రతిభ ఆధారంగా ముందుగా వంద మందిని గుర్తించి వారికి పదిరోజులపాటు తరగతులు నిర్వహిస్తామని, ఉన్నత చదువుల కోసం హార్వర్డ్ యూనివర్సిటీలో చేరడానికి ఈ తరగతులు ఉపయోగపడతాయని చెప్పారు. భవిష్యత్‌లో వందశాతం స్కాలర్‌షిప్ సాధించి ఆర్థిక ఇబ్బందులను అధిగమించి విదేశీ విద్యను అందుకునేందుకు అవసరమైన శిక్షణను ఈ తరగతుల ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కువమంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు.

బీసీ విద్యార్థుల కోసం తరగతులను నిర్వహించడానికి హార్వర్డ్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీతో కలిసి ముందుకు రావడం అభినందనీయమని ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని త్వరలోనే తెలియజేస్తామన్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నతవిద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీ తరగతి గదుల్లోకి మన విద్యార్థులకు ప్రవేశం కల్పించడం ద్వారా ఆ యూనివర్సిటీ చదువుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా హార్వర్డ్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డొమినిక్ మావోకు.. ఆయన రచించిన అమెజాన్ బెస్ట్ సెల్లర్ 'సెల్ఫీ ఆఫ్ సక్సెస్' పుస్తకాన్ని ఆయన బహుకరించారు.

# పేదల ఇండ్లల్లో కల్యాణకాంతులు

హైదరాబాద్, జూన్ 25:కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకా లతో మహిళల కండ్లల్లో సంతోషాన్ని.. వారి ఇండ్లలో కల్యాణకాం తులను నింపిన సీఎం కేసీఆర్‌ను పేదలు దేవుడిలా కొలుస్తున్నారని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ డివిజన్‌లో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైసా ఖర్చులేకుండా తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తుందని తెలిపారు. మహిళల సాధికారతకు విశేషంగా కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ అసలైన మహిళా బంధుగా నిలిచారని.. మహిళలను విశేషంగా గౌరవించే ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కులు అందజేయడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా రూ. 26 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. వీఆర్వోలు విజయ్, స్వామి, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌దాస్, నాయకులు ఖైసర్ జహాన్, గీతాగౌడ్, ఆదిలక్ష్మి, వేణుగోపాల్, నవీన్, చిన్న యాదవ్, శ్రీను, స్రవంతి, అరుణ పాల్గొన్నారు.

# యువకుడి దారుణ హత్య

అమరావతి, జూన్ 25: మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యారు. సంఘటనా స్థలానికి పొన్నూరు రూరల్ పోలీసులు చేరుకుని మృతుడు మేరకు కుమార్ (22)గా గుర్తించారు. అక్రమ సంబంధినే నేపథ్యమే ఈ హత్యకు కారణమై ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.

# ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉంది: మంత్రి బుగ్గన

అమరావతి, జూన్ 25: రాష్ట్ర ప్రభుత్వ మెరుగైన ఆర్థిక నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణతో రికార్డు సృష్టించిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రతిపక్ష టీడీపీ, దాని స్నేహపూర్వక మీడియా అబద్ధాలు వల్లె వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరానా వ్యాప్తి ఉన్నప్పటికీ అధికారులు బాగా పనిచేశారని అభిప్రాయపడ్డారు. టీడీపీ పాలనలో రాష్ట్ర అప్పులు బాగానే ఉన్నాయని, ఇప్పుడు అప్పటికన్నా ఆర్థిక పరిస్థి ఎంతో మెరుగ్గా ఉన్నదన్నారు.

గత ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య వార్షిక రుణ వృద్ధి రేటు 19.2 శాతం ఉండగా, వైసీపీ ప్రభుత్వంలో 15.77కి తగ్గించామని మంత్రి బుగ్గన చెప్పారు. రాష్ట్ర ఆర్థిక లోటు గత ప్రభుత్వంలో సగటున జీఎస్‌డీపీలో 4 శాతంగా ఉండగా.. 2021-22లో 2.10 శాతంగా ఉన్నదన్నారు. అలాగే, రాష్ట్రాన్ని శ్రీలంకతో పోల్చినందుకు ప్రతిపక్షాలు తమ తప్పును తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) పథకాల కింద పారదర్శకంగా రూ. 1.46 లక్షల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా పంపిణీ చేసిందని, డిబిటియేతర పథకాల కోసం మరో రూ. 44,000 కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు.

2014-19 మధ్య టీడీపీ హయాంలో రూ. 27,340 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ పనులు జరగ్గా.. గత మూడేండ్లలో మొత్తం రూ. 27,448 కోట్ల పనులు చేపట్టినట్లు మంత్రి వివరించారు. టీడీపీ హయాంలో రుణాలపై సగటు వడ్డీ రేటు 8 శాతంగా ఉండగా.. ప్రస్తుతం 7 శాతంగా ఉన్నదన్నారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులపై ప్రతిపక్షాలు దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. స్థానిక సంస్థల విద్యుత్ ఛార్జీల పెండింగ్‌లో ఉన్న రూ. 2,200 కోట్ల బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. కొవిడ్ వ్యాప్తిలో ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వంలో 2014-19 మధ్య భారీ, మధ్య తరహా ప్రాజెక్టులలో సగటు పెట్టుబడి రూ. 11,994 కోట్లుగా ఉన్నదని ఆయన చెప్పారు.

# శ్రీవారి భక్తులకు అప్రమత్తతతో సేవలు : టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల, జూన్ 25: స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి సూచించారు. రద్దీ అధికంగా ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తతతో సేవలు అందించాలని ఆదేశించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రద్దీ క్రమేపీ పెరిగే అవకాశం ఉన్నదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు సదుపాయాల కల్పనలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూ లోని భక్తులకు తాగునీరు, అన్న ప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గత కొన్ని నెలలుగా గురువారం నుంచి ఆదివారం వరకు భక్తుల రద్దీ విపరీతంగా ఉంటున్నదన్నారు. ఇందుకై ఆలయంలో, సన్నిధి నుండి వెండి వాకిలి, వెండివాకిలి నుంచి మహద్వారం వరకు అదనంగా అధికారులను నియమించి, షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రద్దీ రోజుల్లో రోజుకు 90 వేల మందికిపైగా దర్శనం చేసుకుంటున్నారని చెప్పారు. క్యూ లైన్ల నిర్వహణ లో టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారులు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యాధికారి తిరుమలలో పరిశుభ్రతతో పాటు భక్తులకు నిరంతరాయంగా తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రిసెప్షన్ అధికారులు గదుల కేటాయింపులో అలస్యం లేకుండా చూడాలన్నారు.

క్యూ లైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2 , నారాయణ గిరి ఉద్యానవనంలో వేచి ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు తాగునీరు, అన్నప్రసాదాలు అందించాలని చెప్పారు. వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు సమస్య కలుగకుండా చూడాలన్నారు. కల్యాణకట్టలో నిత్యం దాదాపు 40 వేల మంది భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారని, రద్దీ కి తగినట్లు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ 2 జగదీశ్వర రెడ్డి, వీజీఓ బాలిరెడ్డి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కార్డ్ టోకెనైజేషన్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ, జూన్ 25: డెబిట్, క్రెడిట్ కార్డ్‌ల టోకెనైజేషన్ గడువును రిజర్వ్‌బ్యాంక్ సెప్టెంబర్ 30 వరకూ పొడిగించింది. కార్డ్-ఆన్-ఫైల్ టోకెనైజేషన్ గడువు ఇప్పటివరకూ జూన్ 30కాగా మరో మూడు నెలలు పొడిగించారు. టోకనైజేషన్ అమలులోకి వచ్చేప్పటకి వ్యాపారస్తులు, పేమెంట్ అగ్రిగేటర్లు వారివద్దనున్న అన్ని కార్డ్‌ల వివరాల్ని డిలేట్ చేసి, వాటి స్థానాన్ని టోకెన్లతో భర్తీ చేయాల్సి ఉంటుంది.

పరిశ్రమ భాగస్వామ్య పక్షాలు వీటి అమలులో తలెత్తుతున్న సమస్యలను ప్రస్తావించారని, వీటిని భాగస్వాములతో చర్చించి పరిష్కరిస్తామని, కార్డ్‌హోల్డర్లకు అసౌకర్యం కలగకుండా, అమలులో అవరోధాలు ఏర్పడకుండా టోకెనైజేషన్ గడువును జూన్ 30 నుంచి సెప్టెంబర్ 30 వరకూ పొడిగిస్తున్నట్టు శుక్రవారం ఆర్బీఐ ఒక సర్క్యులర్ జారీచేసింది. కార్డ్‌హోల్డర్లు వారి కార్డ్‌ల భద్రత కోసం టోకెనైజ్ చేసుకోవాలని ఆర్బీఐ సూచించింది.

# తిరుమలలో అరణ్యకాండ పారాయణ దీక్షకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుమల, జూన్ 25:లోక కల్యాణార్థం తిరుమల వసంత మండపంలో టీటీడీ నిర్వహించనున్న అరణ్యకాండ పారాయణ దీక్ష కార్యక్రమానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా సంకల్పం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, కంకణ ధారణ, అగ్నిప్రతిష్ట, అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కెఎస్ఎస్. అవధాని మాట్లాడుతూ శ్రీరాముడు పితృవాక్య పరిపాలన కోసం అరణ్యవాసం చేస్తూ రాక్షసులను సంహరించి, తపస్సు చేసుకునే ఋషులకు రక్షణ కల్పించాడని తెలిపారు. అరణ్యకాండలోని 75 సర్గల్లో 2,454 శ్లోకాలు ఉన్నాయన్నారు.

ఈ శ్లోకపారాయణ ద్వారా రాక్షస గుణాలు తొలగిపోయి సాత్విక గుణాలు అలవడతాయని అన్నారు. తిరుమలలోని వసంత మండపంలో ప్రతిరోజూ ఉదయం 8.30 గంటల నుంచి 16 మంది వేద, శాస్త్ర పండితులతో పారాయణదీక్ష చేపడతారని చెప్పారు.

మరో 16 మంది పండితులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ధర్మగిరి శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠంలో జప, తర్పణ, హోమాదులు ప్రతి శ్లోకానికీ నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఈవో ఎవి. ధర్మారెడ్డి, వేద పాఠశాల అధ్యాపకులు, వేద పండితులు పాల్గొన్నారు.

# కారుపై విరిగిపడిన చెట్టు- మహిళ మృతి

హైదరాబాద్, జూన్ 25:ఉన్నట్టుండి కారుపై చెట్టు కూలడంతో ఆ కారును డ్రైవింగ్ చేస్తున్న మహిళ మరణించింది. ఈ ఘటన తమిళనాడు రాజధాని చెన్నైలో చోటుచేసుకుంది. నిన్న చెన్నైలో భారీగా వర్షం కురిసింది. 57 ఏళ్ల మహిళ తన కారులో ఆఫీస్ నుంచి ఇంటికి తిరిగి వస్తున్నది. ఆ కారును ఆమె డ్రైవ్ చేస్తుండగా అందులో మరో ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారు. కాగా, ఆ కారు కేకే నగర్ ప్రాంతంలోకి రాగానే నడుస్తున్న కారుపై ఉన్నట్టుండి రోడ్డు పక్కగా ఉన్న ఒక చెట్టు కూలింది. దీంతో డ్రైవింగ్ సీటులో ఉన్న మహిళ అక్కడికక్కడే చనిపోయింది. ఆ కారులో ఉన్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. చెన్నైలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రధాన నగరాలతోపాటు, కూడల్లలో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది.

# మృతుడి భౌతిక కాయానికి ఏనుగు మనోహర్ రెడ్డి నివాళులు




రాజన్న సిరిసిల్ల, జూన్ 25 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ కు చెందిన నాగుల వేణు గౌడ్ (40) సిరిసిల్లలో జరిగిన దాడిలో గాయపడి మరణించగా, అతడి భౌతిక కాయానికి శనివారం టీఆరెస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీఆరెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# సంక్షోభం దిశగా వెళ్తున్న పాక్‌కు చైనా భారీ ఆర్థిక సాయం

న్యూఢిల్లీ, జూన్ 25:ఆర్థికంగా చాలా నష్టాల్లో ఉన్న పాకిస్తాన్‌కు చైనా నుంచి సహకారం లభించింది. ఈ విషయాన్ని పాక్ ఆర్థిక మంత్రి మిఫ్తా ఇస్మాయిల్ వెల్లడించారు. శుక్రవారం నాడు ట్విట్టర్ వేదికగా ఆయన ఈ ప్రకటన చేశారు. కొన్నిరోజుల క్రితమే దీని గురించి ఆయన హింట్ ఇచ్చారు.

ప్రస్తుత ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు చైనాకు చెందిన బ్యాంకుల కన్సార్షియం తమ దేశానికి సుమారు 2.3 బిలియన్ డాలర్ల అప్పు ఇచ్చేందుకు సిద్ధమయ్యాయని, మరికొన్ని రోజుల్లో ఈ సొమ్ము పాక్ ఖాతాలకు చేరుతుందని ఇస్మాయిల్ ఇదివరకే ట్వీట్ చేశారు.

తాజాగా ఈ సొమ్ము స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్తాన్ (ఎస్‌బీపీ) ఖాతాకు చేరినట్లు ఆయన వెల్లడించారు. దీంతో పాక్ విదేశీ మారక ద్రవ్యం నిల్వలు పెరిగాయని తెలిపారు. కొన్నిరోజులుగా ఆర్థిక సంక్షోభంతో విలవిల్లాడుతున్న పాక్.. శ్రీలంక బాటలోనే నడిచేలా కనిపించింది.

చివరకు ప్రజలు తాగే టీ కూడా రోజుకు రెండు, మూడు కప్పులే తాగాలని ఆ దేశ మంత్రులు సూచనలు ఇచ్చే స్థాయికి ఆ దేశ ఆర్థిక పరిస్థితి దిగజారింది. ఇలాంటి సమయంలో చైనా నుంచి ఆర్థిక సహాయం లభించడంతో ఆ దేశం కొంత తేరుకున్నట్లేనని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

# ఏపీ గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్.. ఉత్తర్వులు జారీ

అమరావతి, జూన్ 25: గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు ఎప్పటి నుంచే ఎదురుచూస్తున్న ప్రొబేషన్ డిక్లరేషన్‌పై ప్రభుత్వం వారికి శుభవార్త చెప్పింది. ప్రొబేషన్ డిక్లరేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. వారి ప్రొబేషన్‌ను డిక్లేర్ చేసే అధికారం కలెక్టర్లకు అప్పగిస్తున్నట్లు శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెండేండ్ల సర్వీసు పూర్తి చేసుకుని డిపార్ట్‌మెంటల్ పరీక్ష పాసైన వారికి ప్రొబేషన్‌ను ఖరారు చేయనున్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన జగన్ సర్కార్.. వారి జీతభత్యాలకు సంబంధించిన అంశాలను కూడా క్లియర్ చేసింది. పేస్కేలును ఫిక్స్ చేసిన దాని ప్రకారం పంచాయతీ సెక్రటరీ/వార్డు సెక్రటరీ గ్రేడ్-5 ఉద్యోగులకు బేసిక్‌పేగా రూ.23,120-74,770 గా ఖరారు చేశారు. మిగతా ఉద్యోగులకు రూ.22,460-72,810 గా నిర్ణయించారు. వచ్చే నెల ఒకటో తారీఖు నుంచి కొత్త పీఆర్సీ, ఆగస్టు నుంచి కొత్త జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి. ఈ బేసిక్ ప్రకారం దీనికి డీఏ, హెచ్‌ఆర్‌ఏ కలిపితే ఒక్కో ఉద్యోగి దాదాపు రూ.30 వేల వరకు జీతాలు అందుకోనున్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్‌ను డిక్లేర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. వీరికి కొత్త పీఆర్సీ ప్రకారం జీతాలు అందేలా ఆదేశాలు ఇవ్వడం పట్ల సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.




# జగన్‌పై కుట్రలు చేసిన వారు కష్టాలు పడుతున్నారు.. నారాయణస్వామి




తిరుపతి, జూన్ 25: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై కుట్రలు చేసిన వారు కష్టాలు అనుభవిస్తున్నారని రాష్ట్ర డిప్యూటీ సీఎం కళత్తూర్ నారాయణస్వామి అన్నారు. శనివారం ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో తిరుపతి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ? సోనియా గాంధీతో కలిసి చంద్రబాబు కుట్ర చేసి వైయస్ జగన్మోహన్ రెడ్డిని జైల్లో పెట్టించడం జరిగిందని గుర్తు చేశారు. తొడలు కొట్టే కార్యక్రమానికి నారా లోకేష్ సహా తెలుగుదేశం నాయకులు స్వస్తి పలకాలని కోరారు. గడపగడపకు వెళ్తుంటే ప్రజలు బ్రహ్మరథంతో స్వాగతం పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టడం జరిగిందని తెలిపారు. టీటీడీ ఉద్యోగులు తిరుమల స్థానికుల బాగోగుల కోసం ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కృషి చాలా అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి టిటిడి ఉద్యోగస్తులు అండగా ఉండి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ? సమిష్టిగా పనిచేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు అందరూ నడుం బిగించాల్సిన అవసరముందన్నారు. తిరుపతి ప్రజల అభ్యున్నతి కోసం రాజీలేని పోరాటం చేసిన ఘనత కరుణాకర్ రెడ్డిదేనన్నారు. ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు అందిస్తుందన్నారు. దివంగత నేత వైఎస్సార్ ఆశయ సాధన కోసం జగనన్న అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. భావితరాలకు జగనన్న ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ? జగనన్న ప్రభుత్వం విద్యా వైద్యం పరిపాలన వికేంద్రీకరణ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లా పరిశీలకులు ఆనం విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆలోచనలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ? రానున్న తిరుపతి కోపరేట్ బ్యాంకు ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. లక్షా నలభై వేల కోట్ల రూపాయలు 2.20 కోట్ల మంది ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 175 స్థానాలు దక్కించుకోవడమే ఏకైక అజెండా కావాలని శ్రేణులకు ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. భూమన అభినయ్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్లీనరీ సమావేశంలో కేడర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ, నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్ రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సీనియర్ కరాటే మాస్టర్ వసంత్ కుమార్‌కు ఉత్తమ పురస్కారం




--ఉత్తమ నేషనల్ బ్రూస్ లీ అల్ మార్షల్ ఆర్ట్స్ అవార్డ్ వరింపు

--రాష్ట్ర మంత్రి కమలాకర్ ప్రశంస

కరీంనగర్ , జూన్ 25(నేటినిజం ప్రతినిధి): కరాటే సీనియర్ మాస్టర్, కరాటే అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ వసంత్ కుమార్ కి ఉత్తమ నేషనల్ బ్రూస్ లీ అల్ మార్షల్ ఆర్ట్స్ అవార్డ్ 2022 వరించింది. ఇటీవల బెంగళూర్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలోగ్లోబల్ వరల్డ్ రికార్డ్ వారుఉ త్తమఇంటర్నేషనల్ బ్రూస్ లీ అల్ మార్షల్ ఆర్ట్స్ అవార్డ్ 2022ను రాష్ట్ర బిసి బిసి సంక్షేమ శాఖ మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ చేతుల అవార్డును ప్రదానం చేసి అభినందించారు కాగా వసంత్ కుమార్ గత 40 సంవత్సరాల నుండి కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది పిల్లలకు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ద్వారా శిక్షణ ఇస్తూ ప్రత్యేకతను చాటుకున్నారు. ఇటీవల ప్రపంచములోనే అగ్రగామి రాజ్యమైన అమెరికాలోని వసంత్ కుమార్ డెలివర్ స్టేట్ కరాటే శిక్షణ ఇచ్చిఅంతర్జాతీయస్థాయి శిక్షకుడిగా గుర్తింపు పొందారు. 2019 డిసెంబర్ 10న సుమారు 10 వేల మంది అమ్మాయిలకు కరాటలో ఆత్మరక్షణ మెలకువలను కరీంనగర్అంబేద్కర్ స్టేడియంలో పోలీస్ కమిషనరేట్ శిక్షణ ద్వారా ఇచ్చారు. అలాగే

కొన్ని వందల మందిని బ్లాక్ బెల్ట్ హో?ల్డర్స్ గా తీర్చిదిద్దారు. 2012 డిసెంబర్ 300 వందల మంది ట్రేనీ సబ్ ఇన్స్పెక్టర్స్ సికింద్రాబాద్ జిల్లా ఖానా గ్రౌండ్ లోఅన్ ఆర్మ్ కంబాక్ట్ జాతీయస్థాయి అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చారు. సంగారెడ్డి షీటీమ్స్ శిక్షణ ఇచ్చి వారి ద్వారా 2015 మే 31న వంటిమామిడిలో ముఖ్యమంత్రి కేసీఆర్ చంద్రశేఖర్రావు ఎదుట అద్భుత ప్రదర్శన ఇచ్చారు. కాగా వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని గుర్తింపుగా వసంత్ కుమార్ కు గ్లోబల్ వరల్డ్ రికార్డ్ వారు ఉత్తమ ఇంటర్నేషనల్ బ్రూస్ లీ అల్ మార్షల్ ఆర్ట్స్ అవార్డ్ 2022 ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు ,సుడా చైర్మన్ జి.వి.రామకృష్ణారావు, జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చల్లా హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు .

# దళిత బంధు పథకంలో మంజూరైన యూనిట్ల గ్రౌండింగ్ వేగవంతంగా పూర్తి చేయాలి..... !

-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ .

సంగారెడ్డి, జూన్ 25 (నేటి నిజం ప్రతినిధి) దళిత బంధు పథకం కింద చేపట్టిన అన్ని యూనిట్లు త్వరితగతిన గ్రౌండింగ్ కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, , ఎంపీడీవో లతో దళిత బందు యూనిట్ల గ్రౌండింగ్ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పూర్తయిన యూనిట్లు వివరాలను, ఇంకా పూర్తికాకుండా ఉన్న యూనిట్ల కు సంబంధించి కారణాలను ఆయా ఎంపిడి ఓ లను అడిగారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రత్యేక అధికారులు , ఎంపీడీవోలు యూనిట్ వారిగా ఎప్పటికప్పుడు సమీక్షించి లబ్ధిదారులకు దిశానిర్దేశం చేయాలన్నారు.

డైరీ, పౌల్ట్రీ వంటి యూనిట్ల గ్రౌండింగ్ కు అవసరమైన అన్ని వసతుల ఏర్పాట్ల లో జాప్యంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ,ఇకనైనా దృష్టి సారించాలన్నారు. బోర్ వేసిన తరువాత లబ్ధిదారులకు నచ్చిన మోటార్లు తెచ్చుకునే విధంగా పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. గ్రౌండింగ్ అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి యూనిట్ల గ్రౌండింగ్ కు అవసరమైన ఏర్పాట్లతో పాటు, యూనిట్ కు అవసరమైన సౌకర్యాలను పరిశీలించాలన్నారు.

దళిత బంధు కింద లబ్ధిదారులకు మంజూరు చేసిన యూనిట్ లు త్వరితగతిన ఏర్పాటు చేసేల చర్యలు చేపట్టాలని ఎంపీడీఓలకు సూచించారు.

ముఖ్యంగా గేదలకు సంబంధించిన యూనిట్లలో షెడ్లు పూర్తి కావాలని, వెంటనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్ణీత సమయంలోగా పూర్తి చేయనట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు.



దళిత బంధు అమలులో ఎలాంటి పొరపాట్లు జరిగినా సహించబోమని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబురావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాస్ రావు, మండల ప్రత్యేక అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారి వసంత ఆయా మండలాల ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌తో మత్స్యశాఖ ఒప్పందం




విశాఖపట్నం, జూన్ 25: కేంద్ర ప్రభుత్వ మత్స్య శాఖ.. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)తో జతకట్టింది. భారతదేశం అంతటా డ్రెడ్జింగ్, ఇతర సముద్ర కార్యకలాపాల ద్వారా ఫిషింగ్ హార్బర్‌లు, రిజర్వాయర్‌లు, చెరువులు, ఇతర నీటి వనరులను అభివృద్ధి చేయడానికి మత్స్య శాఖ, మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖతో ఒప్పందం కుదిరింది. ఈ మేరకు న్యూఢిల్లీలో మత్స్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి జతీంద్ర నాథ్ స్వైన్, జాయింట్ సెక్రటరీ జే బాలాజీ సమక్షంలో డీసీఐ ఎండీ, సీఈవోలు ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ఫిషింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేయడంతోపాటు నిర్వహణ కోసం రాష్ట్రాలు, కేంద్రంతో దీర్ఘకాలిక ఒప్పందాలను కుదుర్చుకునేందుకు డీసీఐఎల్‌కు ఈ ఒప్పందం భారీ అవకాశం కల్పిస్తుందన్నారు. అలాగే, 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.1,000 కోట్ల టర్నోవర్‌ను చేరుకోవడంలో ఇది డీసీఐకి కొత్త వ్యాపార మార్గాలను తెరుస్తుందని చెప్పారు. డీసీఐఎల్-గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఫిషరీస్ డైరెక్టరేట్ మధ్య ఇప్పటికే ఒక అవగాహన ఒప్పందం కుదిరిందని, దీనికి సంబంధించిన పనులు మాంగ్రోల్ ఫిషింగ్ హార్బర్ రాక్ డ్రెడ్జింగ్‌లో ప్రారంభమయ్యాయని తెలిపారు. దీని ద్వారా భవిష్యత్ అన్ని రాక్ డ్రెడ్జింగ్ ప్రాజెక్ట్‌లకు అర్హత పొందేందుకు డీసీఐఎల్‌కు వీలు కలుగుతుందన్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్).. మన దేశంలోని ప్రధాన డ్రెడ్జింగ్ సంస్థల్లో ఒకటిగా ఉన్నది. ఎగ్జిమ్ కోసం సురక్షితమైన నావిగేషనల్ ఛానెల్‌ని లోతుగా చేపట్టడం ద్వారా ప్రధాన నౌకాశ్రయాలు, మైనర్ పోర్టులు, ఇండియన్ నేవీ, ఫిషింగ్ హార్బర్‌లు, ఇతర సముద్ర సంస్థలకు డ్రెడ్జింగ్, అనుబంధ సేవలను అందిస్తున్నది. ప్రస్తుతం మత్స్యశాఖతో ఒప్పందంతో దేశంలోని ఫిషింగ్ హార్బర్‌లు, రిజర్వాయర్‌లు, చెరువులు అభివృద్ధికి నోచుకుంటాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చుతున్నారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాల సంఘం నూతన కార్యవర్గం



రాజన్న సిరిసిల్ల, జూన్ 25 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాల సంఘం అధ్యక్షఎన్నికలు శనివారం నిర్వహించడం జరిగింది అధ్యక్షులు-వంకాయల మహేశ్వర్, ఉపాధ్యక్షులు వంకాయల కనుకయ్య ఎరుగొక్కుల రాజనర్సు,ప్రధాన కార్యదర్శులుగా వంకాయల ప్రశాంత్, ఏరుగొక్కుల రమేష్..గౌరవ సలహా దారులు వంకాయలలక్ష్మిరాజం, కూతురు బక్కయ్య, వంకాయలనరేష్, వంకాయల గట్టయ్య అలాగే కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికకు సహకరించిన సంఘం సభ్యులకు నూతనఎన్నికైన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

# రేపటి నుంచి ఇంద్రకీలాద్రిపై పొగాకు నిషేధ చట్టం అమలు

అమరావతి, జూన్ 25: తిరుమలలో మాదిరిగా పవిత్ర పుణ్యక్షేత్రమైన విజయవాడలోని ఇంద్రకీలాద్రి అమ్మవారి పరిసర ప్రాంతాల్లోనూ రేపటి నుంచి పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టం అమలుకు రంగం సిద్ధమైంది. నిబంధనలు ఉల్లంఘించే ఉద్యోగులు, భక్తులకు రూ. 20 నుంచి రూ. 200 వరకు జరిమానా విధిస్తామని కలెక్టర్ ఢిల్లీరావు హెచ్చరించారు. నేషనల్ టొబాకో కంట్రోల్, కోట్పా 2003 చట్టంలో భాగంగా ఆలయ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు నిషేధమన్నారు. ఇప్పటికే ఈ చట్టాన్ని తిరుమలలో అమలు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు.

ఆలయానికి వచ్చే భక్తులు, పని చేసే ఉద్యోగులు ఆలయ పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులు వాడకూడదని స్పష్టం చేశారు. భక్తులకు అన్ని విధాలుగా ఈ చట్టంపై ఆలయంలో అవగాహన కల్పిస్తామని తెలిపారు.

# ఉందిలే... మంచికాలం... ముందుముందునా..!

- దమ్మపేటలో పొంగులేటి పర్యటన

- పలకరిస్తూ... భరోసానిస్తూ ముందుకు సాగిన మాజీ ఎంపీ



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 25 (నేటి నిజం ప్రతినిధి) : దమ్మపేట: మంచికాలం సమీపించే గడియలు ఆసన్నమయ్యాయని... రాబోయే రోజులన్నీ మనవేనని... ఏఒక్క అక్క... చెల్లి... అన్న... తమ్ముడు అధైర్యపడొద్దని... ప్రతిఒక్కరికి అండగా ఉంటానని హామీ ఇస్తూ.. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ... బాధిత కుటుంబాలకు నేనున్నా మీ శీనన్ననే భరోసానిస్తూ దమ్మపేట మండలంలో తెరాస రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం పర్యటించారు. పర్యటన లో భాగంగా నాగవల్లి, నాచారం, తొట్టిపంపు, గణేష్పాడు, మందలపల్లి, రంగువారిగూడెం, పాతచీపురుగూడెం తదితర గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. పలు వివాహాది శుభకార్యక్రమాల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. పట్టువస్త్రాలను కానుకగా సమర్పించారు. ఇటీవల చనిపోయిన పలువురు వ్యక్తుల కుటుంబాలను పరామర్శించారు. వివిధ ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులను పరామర్శించి ప్రస్తుతం వారి ఆరోగ్యస్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు ఇతర ప్రయివేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# లింగగూడెం గ్రామ పంచాయతీ లో పలు కార్యక్రమాలలో పాల్గొన టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కోసూరి శ్రీనివాసరావు



ఖమ్మం, జూన్ 25 (నేటి నిజం ప్రతినిధి) :కొనిజర్ల మండలంలోని లింగగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని బస్వాపురం గ్రామంలో సైడ్ డ్రైనేజీ పనులను మరియు లింగగూడెం గ్రామ మాజి సర్పంచ్ జడ నరసయ్య-సతీమణి ఇలావతి, దశ దిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కోసూరి శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ వింజం విజయ, స్థానిక సర్పంచ్ దొండపాటి లక్ష్మీ, సూడా డైరెక్టర్ బండారు కృష్ణ, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు రాయల పుల్లయ్య, వింజం పిచ్చయ్య, పెనుగొండ నాగార్జున్, మద్దిని ఆదినారాయణ, లక్ష్మయ్య, శివకోటి, దుర్గయ్య, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మాయావతి మద్దతు

లక్నో, జూన్ 25:రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు బీఎస్పీ చీఫ్ మాయావతి మద్దతు ప్రకటించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో తమ ఎంపీలు ద్రౌపదికి ఓట్లు వేస్తారని చెప్పారు. 'ఎన్డీయే అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతివ్వాలని తాము నిర్ణయించాం. తాము బీజేపీకి గానీ, ఎన్డీయేకి గానీ మద్దతు ఇవ్వడంలేదు. అలాగని ప్రతిపక్షాలకూ వ్యతిరేకం కాదు. పార్టీ విధానాలను దృష్టిలో ఉంచుకుని ఈమేరకు నిర్ణయం తీసుకున్నాం' అని మాయావతి చెప్పారు. కాగా, మద్దతు అంశంపై ప్రతిపక్షాలు తమను సంప్రదించలేదని వెల్లడించారు. కాగా, ద్రౌపతి ముర్ము రాష్ట్రపతి అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఇక రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. ముర్ముకి ఇప్పటికే ఎన్డీయే పక్షాలు కాకుండా బిజూ జనతాదళ్, వైఎస్ఆర్‌సీపీ, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి అజిత్ జోగి నేతృత్వంలోని జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జే) వంటి పార్టీ మద్దతు పలికాయి. వచ్చే నెల 18న రాష్ట్రపతి ఎన్నికలు జరుగనున్నాయి. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా పోటీచేస్తున్న విషయం తెలిసిందే.

# చెన్నై ఓపెన్ చెస్.. మళ్లీ టాప్‌లోకి వచ్చిన నితిన్ సెంథివేల్, రేపు ఫైనల్ పోరు!




చెన్నై,జూన్ 25: చెన్నైలో ఓపెన్ ఇంటర్నేషనల్ 13వ గ్రాండ్ మాస్టర్ చెస్ టోర్నమెంట్ జరుగుతోంది. ఈ టోర్నమెంట్‌లో భాగంగా ఇవ్వాల (శనివారం) భారత అంతర్జాతీయ మాస్టర్ నితిన్ సెంథిల్‌వేల్ అద్భుత ప్రదర్శన చాటుకున్నాడు. తొమ్మిదో రౌండ్‌లో ఆధిక్యంలోకి వచ్చిన నితిన్ సెంథిల్‌వేల్ తన సహచర ఆటగాడు అయిన రవిచంద్రన్ సిద్ధార్థ్‌తో డ్రాతో సరిపెట్టుకున్నాడు. ఉఓ బోరిస్ సావ్‌చెంకో (రష్యా), అలెక్సీ ఫెడెరోవ్ (బెలారస్), ఆరోన్యాక్ ఘోష్, హిమ్ ఆల్ గుసైన్ (ఇద్దరూ) 7.5 పాయింట్లకు చేరుకోవడంతో నితిన్ ఆధిక్యం సగం పాయింట్‌కు పడిపోయింది.

కాగా, శుక్రవారం టోర్నమెంట్ లీడర్ నితిన్ టాప్ సీడ్ గ్రాండ్‌మాస్టర్ సవ్‌చెంకోపై విజయానికి చేరువలోకి వచ్చి నిలిచిపోయాడు. ఈ రోజు డ్రా నుంచి గెలుపొందడానికి రెడీగా ఉన్న సిద్ధార్థ్‌పై సెంథిల్‌వేల్ పైచేయి సాధించాడు. ఈ ఆటకు సంబంధించిన ఫైనల్ రౌండ్ ఆదివారం జరగనుంది.

ఫలితాలు: రౌండ్ 9: రవిచంద్రన్ సిద్ధార్థ్ (7)తో నితిన్ ఎస్ (8) డ్రా, ఎస్ ప్రసన్న (6.5) బోరిస్ సవ్‌చెంకో (రష్యా) చేతిలో 7.5తో ఓడిపోయారు. పి కొంగువెల్ (6.5) అలెక్సీ ఫెడోరోవ్ (7) చేతిలో ఓడిపోయారు. ఆరోన్యక్ ఘోష్ (7.5) బాగ్దాసర్యన్ వాహే (అర్మేనియా)పై 6.5, హిమ్ ఆల్ గుసేన్ (7.5) దక్షిణ్ అరుణ్ (6.5)పై, కునాల్ ఎమ్ (6.5) దీపన్ చక్రవర్తి జె (6.5)తో డ్రా, ఆర్యన్ వర్ష్నే (6.5) కిరిల్ స్తూపక్‌తో డ్రా చేసుకున్నారు. (6.5), అజయ్ కార్తికేయన్ (6.5) శరవణ కృష్ణన్ పి (6.5)తో డ్రా చేసుకోగా, ప్రియాంక కె (6) శ్రీహరి ఎల్ ఆర్ (7), ఆర్ ఆర్ లక్ష్మణ్ (6.5) జుబిన్ జిమ్మీ (6.5), న్గుయెన్ వాన్ హుయ్ (వియత్నాం)తో డ్రా చేసుకున్నారు. 7 బీట్ హిర్తికేశ్ పీఆర్ (6), రాజేష్ వీఏవీ (7) ప్రణవ్ కేపీ (6)పై, సమృద్ధ ఘోష్ (5.5) హరి మాధవన్ ఎన్ బీ (6.5) చేతిలో ఓడిపోయారు.

# త్వరలో ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ రేసింగ్ ఫ్రాంచైజీ

**మద్దతునందించేందుకు సుప్రసిద్ధ నటుడు, వ్యాపారవేత్త విజయ్ దేవరకొండను తమ బోర్డ్‌పైకి తీసుకువచ్చిన ఇండియన్ మోటర్‌స్పోర్ట్స్ కంపెనీ ఆర్‌పీపీఎల్**




హైదరాబాద్, జూన్ 25: ఇండియన్ మోటర్‌స్పోర్ట్స్ కంపెనీ, ఆర్‌పీపీఎల్ (రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్) తమ ఫ్రాంచైజీ మోడల్ ఆధారిత ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌ను ప్రకటించింది. సుప్రసిద్ధ నటుడు, వ్యాపారవేత్త విజయ్ దేవరకొండ ఇప్పుడు హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ ఫ్రాంచైజీకి మద్దతునందించనున్నట్లు వెల్లడించింది. సుప్రసిద్ధ నటుడు విజయ్ దేవరకొండతో భాగస్వామ్యం, భారతదేశంలో మోటర్ స్పోర్ట్స్‌ను విప్లవాత్మీకరించాలనే ఆర్‌పీపీఎల్ యొక్క లక్ష్యం చేరుకునేందుకు సహాయపడుతుంది. ఈ ఫెస్టివల్ నవంబర్ 11వ తేదీ నుంచి ప్రారంభంకానుంది. పలు ఫ్రాంచైజీలు ఈ ఫార్మాట్‌లో పాల్గొనడంతో పాటుగా వారాంతాలలో పలు నగరాల్లో జరిగే పోటీల ద్వారా ప్రేక్షకులను ఉర్రూతలూగించనున్నాయి. ఈ పోటీలు రేస్ ట్రాక్‌లతో పాటుగా స్ట్రీట్ సర్క్యూట్‌లలో కూడా జరుగనున్నాయి.

ఎంఈఐఎల్ డైరెక్టర్ మరియు ఆర్‌పీపీఎల్ (రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్) ఛైర్మన్ అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ " భారతదేశంలో అపారమైన క్రీడా సామర్థ్యం ఉంది. కాకపోతే ఆ ప్రతిభ వెల్లడి కావడానికి తగిన అవకాశాలు లేవు. రాబోయే 5?7సంవత్సరాలలో పూర్తి భారతీయ బృందాన్ని ఎఫ్1కు పంపాలన్నది మా లక్ష్యం. అలాగే రాబోయే 10?12 సంవత్సరాలలో పూర్తి భారతీయ మహిళల బృందాన్ని ఎఫ్ 2కు పంపాలన్నది మా లక్ష్యం. విజయ్ దేవరకొండ మాకు మద్దతునందించడం పట్ల చాలా సంతోషంగా ఉన్నాము. యువత నడుమ అత్యంత ప్రాచుర్యం పొందిన నటుడు ఆయన. విజయవంతమైన చిత్రాల ద్వారా మాత్రమే కాదు, వ్యాపార సంస్థలు,దాతృత్వ కార్యక్రమాల ద్వారా కూడా ఆయన సుప్రసిద్ధులు" అని అన్నారు

నటుడు, వ్యాపారవేత్త విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "ఈ లీగ్ లో భాగం కావడం పట్ల సంతోషంగా ఉన్నాను. దేశవ్యాప్తంగా క్రీడా ప్రేమికులకు నూతన అవకాశాలను ఇది అందించనుంది. భారతదేశంలో రేసింగ్‌కు ఇప్పుడు ప్రత్యేక స్థానముంది" అని అన్నారు.

భారతదేశంలో తమ అతిపెద్ద ఫార్ములా రేసింగ్ కార్యక్రమానికి తేదీలను ఇటీవలనే ఆర్‌పీపీఎల్ ప్రకటించింది. ఇండియన్ రేసింగ్‌లీగ్ లో ఎఫ్ఐఏ సర్టిఫైడ్ ఫార్ములా 4 మరియు ఫార్ములా రీజనల్ ఇండియన్ చాంపియన్‌షిప్‌లు నవంబర్ ?డిసెంబర్ 2022 మధ్య జరుగునున్నాయి. ఈ పోటీలు హైదరాబాద్, గ్రేటర్ నోయిడా , కోయంబత్తూరు, చెన్నైలలో జరుగుతాయి.

# 500 రోజుకు చేరిన విశాఖ ఉక్కు ఉద్యమం

విశాఖపట్నం, జూన్ 25: విశాఖ స్టీల్ ప్లాంట్ (వీఎస్‌పీ) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం 500 రోజుల మార్క్‌కు చేరుకున్నది. విశాఖ ఉక్కు ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా ఉండేందుకు వీఎస్‌పీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు గత ఏడాదిన్నరకుపైగా కాలంగా పోరాడుతున్నారు. మరోవైపు వీరికి లొంగకుండా కేంద్రం తన ప్రయత్నం తాను చేస్తున్నది. విశాఖ ఉక్కు ఉద్యమం 500 రోజులకు చేరినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే సూచనలు మాత్రం కనిపించడం లేదు.

విశాఖ ఉక్కు ప్లాంటును అమ్మేయాలన్న కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ (వీయూపీపీసీ) ఏర్పాటైంది. ఈ కమిటీ ఆధ్వర్యంలో కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ఇలాఉండగా, ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఢిల్లీలో లావాదేవీల సలహా కమిటీ, న్యాయ సలహా కమిటీని ఏర్పాటు చేశారు.

ప్రైవేటీకరణకు నిరసనగా చేపట్టిన ఆందోళనలు 500 రోజులకు చేరిన సందర్భంగా కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేందుకు కార్మిక సంఘాలు ఆదివారం పెద్దఎత్తున నిరసనలు చేపట్టాలని నిర్ణయించాయి. గతంలో కూడా వీయూపీపీసీ ప్రతినిధులు, వీఎస్‌పీ ఉద్యోగులు ఏపీ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు. కోటి సంతకాల ప్రచారం, పాదయాత్రలు, ర్యాలీలు, రాష్ట్రవ్యాప్త బంద్‌లు, రిలే నిరాహార దీక్షలు, బహిరంగ సభలు, రాస్తారోకోలు చేపట్టి తమ నిరసనను వ్యక్తపరిచాయి. వీరి ఆందోళనలకు అధికార వైసీపీ కూడా మద్దతు తెలిపింది.

కూర్మన్నపాలెం జంక్షన్‌లో ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న ప్రారంభమైన రిలే నిరాహారదీక్షకు దేశంలోని వివిధ రంగాలకు చెందిన పలువురు నాయకులు తరలివచ్చి మద్దతు తెలిపారు. అయితే, వారి విజ్ఞప్తులను కేంద్రం పెడ చెవిన పెట్టింది. గతంలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) కి కేటాయించిన రాబోడిహ్ బొగ్గు గనుల రద్దుకు ముందుకొచ్చింది. వీఎస్‌పీకి చెందిన ఉద్యోగులు, యూనియన్ నాయకులు తమ పోరాటాన్ని కొనసాగిస్తుండగా, కేంద్రం కూడా ప్రైవేటీకరణ చర్యతో మరింత ముందుకు సాగుతున్నది. కేంద్రం మొదలు వంచేందుకు మున్ముందు వీరి ఉద్యమం ఎలా కొనసాగుతుందో వేచి చూడాల్సిందే.

# ఆప్ రోడ్‌షోలో కేజ్రీవాల్, భగవంత్ మాన్ ప్రచార హోరు!

సిమ్లా, జూన్ 25: హిమాచల్ ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. కులులో ఢిల్లీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ శనివారం రోడ్ షో నిర్వహించారు. రాష్ట్రంలో రాజకీయాలు చేసేందుకు తాము రాలేదని ఆప్ అవినీతిని రూపుమాపడమే అజెండాగా పనిచేస్తుందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తమకు రాజకీయాలు తెలియవని తొలుత తాము ఢిల్లీలో అవినీతిని అంతమొందించి ఆపై పంజాబ్‌లోనూ అవినీతి నిర్మూలనకు పాటుపడుతున్నామని అన్నారు.

అవినీతి ఆరోపణలపై పంజాబ్ సీఎం భగవంత్ మాన్ తన సహచర మంత్రిని జైలు పంపారని గుర్తుచేశారు. అవినీతిని కప్పిపెట్టవచ్చని కానీ తాము అలా చేయబోమని స్పష్టం చేశారు. తమ మంత్రిని జైలుకు పంపిన సీఎం గురించి మీరు ఎక్కడైనా విన్నారా అని రోడ్‌షోకు హాజరైన ప్రజలను కేజ్రీవాల్ ప్రశ్నించారు. మీడియా, విపక్షాలకు తెలియక ముందే అవినీతిని పసిగట్టిన భగవంత్ మాన్ తన మంత్రివర్గ సహచరుడిని జైలుకు పంపారని చెప్పారు.

మాన్ తలుచుకుంటే మంత్రి అవినీతి బాగోతం బయటకు రాకుండా చూసేవారని, తనకూ ముడుపుల్లో వాటా ఇవ్వాలని కోరేవారని కానీ మాన్ అలా చేయలేదని నిజాయితీగా వ్యవహరించారని ప్రశంసించారు. ఇక త్వరలో జరిగే హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి పాలక బీజేపీ, కాంగ్రెస్, ఆప్‌ల మధ్య ముక్కోణపు పోటీ ఉంటుందని భావిస్తున్నారు.

# నృత్య కళాని కళానికేతన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ మన్నాన్ కు సత్కారం

**-మన్నాన్ కు ఇంటర్నేషనల్ అవార్డు రావడం పట్ల హర్షం**



రాజన్న సిరిసిల్ల, జూన్ 25 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఓకినావా మార్షల్ ఆర్ట్ అకాడమీ ఫౌండర్, సీనియర్ జర్నలిస్టు ఎంఏ మన్నాన్ కు బ్రూస్ లీ ఆల్ మార్షల్ ఆర్ట్స్-2022 ఇంటర్నేషనల్ అవార్డు రావడం పట్ల నృత్య కళానికేతన్ సేవా సంస్థ వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం నృత్య కళానికేథన్ ఆధ్వర్యంలో మన్నాన్ ను శాలువాతో సన్మానించారు.

అనంతరం నృత్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు అధ్యక్షుల యెల్ల పోశెట్టి మాట్లాడుతూ మన్నాన్ కుఅంతర్జాతీయ గుర్తింపు పొందిన గ్లోబల్ వరల్డ్ రికార్డ్ సంస్థ గుర్తింపు రావడం హర్షణీయమని అన్నారు. మన్నాన్ 35 ఏళ్ళ పాటు వేలాదిమంది ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో బ్లాక్ బెల్ట్స్, బంగారు పతకాలు సాధించేలా ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

మన్నాన్ శిక్షణలో ఇలాంటి పురస్కారాలు మరెన్నో వరించాలని వారుకోరుకున్నారు. అనంతరం తనను సన్మానించినందుకు నృత్య కళానికేతన్ సేవా సంస్థ వారికి మన్నాన్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరండాన్సర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల కిందట మన్నన్ దగ్గర శిక్షణ తీసుకున్నప్పుడు ఎలా ఉందో ఇప్పటివరకు కూడా వారి పట్ల అదే గౌరవం ఉందని తెలిపారు. మన్నాన్ ను ఒక గురువుగా సత్కరించుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నామని తెలియజేశారు. కరాటే శిక్షణలో ఇప్పటి వరకు దాదాపు ఐదు వేల మందిని తయారుచేసి, వారందరూ కూడా ఎన్నో అవార్డులు తెచ్చుకునేలా వారికి శిక్షణ పొందేలా చేశారని, ఈ సందర్భంగా ఆయనను సత్కరించుకోవడం కూడా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు వారాల దేవయ్య,సంస్థ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు గాయకులు సంతోష్ కుమార్ ,సావన పెల్లి శ్రీనివాస్, సభ్యులు మామిండ్ల సత్తయ్య, అన్నారం హరీష్ ,వంగల శ్రీధర్, దానరి యాదగిరి,దూన మల్లేశం తదితర కళాకారులు అందరూ పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఇంద్రకీలాద్రిపై పొగాకు నిషేధ చట్టం అమలు

అమరావతి, జూన్ 25: తిరుమలలో మాదిరిగా పవిత్ర పుణ్యక్షేత్రమైన విజయవాడలోని ఇంద్రకీలాద్రి అమ్మవారి పరిసర ప్రాంతాల్లోనూ రేపటి నుంచి పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టం అమలుకు రంగం సిద్ధమైంది. నిబంధనలు ఉల్లంఘించే ఉద్యోగులు, భక్తులకు రూ. 20 నుంచి రూ. 200 వరకు జరిమానా విధిస్తామని కలెక్టర్ ఢిల్లీరావు హెచ్చరించారు. నేషనల్ టొబాకో కంట్రోల్, కోట్పా 2003 చట్టంలో భాగంగా ఆలయ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు నిషేధమన్నారు. ఇప్పటికే ఈ చట్టాన్ని తిరుమలలో అమలు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు.

ఆలయానికి వచ్చే భక్తులు, పని చేసే ఉద్యోగులు ఆలయ పరిసర ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులు వాడకూడదని స్పష్టం చేశారు. భక్తులకు అన్ని విధాలుగా ఈ చట్టంపై ఆలయంలో అవగాహన కల్పిస్తామని తెలిపారు.

# ఇస్లాంనగర్‌లో రూ.5 లక్షలతో సీసీ డ్రైనేజీకి భూమి పూజ

**-మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి**



రాజన్న సిరిసిల్ల, జూన్ 25 (నేటినిజం ప్రతినిధి): వేములవాడలో విలీన గ్రామమైన నాంపల్లి ఐదవ వార్డ్ ఇస్లాంనగర్ లో 13వ ఆర్థిక సంఘం నిధులు 5 లక్షల రూపాయలతో సీసీ డ్రైనేజీకి స్థానిక కౌన్సిలర్ జడల లక్ష్మీ ఆధ్వర్యంలో

మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి శనివారం భూమి పూజ చేసి పనుల ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాధవి మాట్లాడుతూ పట్టణంతో పాటు విలీన గ్రామాల అభివృద్ధి దిశగా మా పాలకవర్గం పనిచేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే రమేష్ బాబు సహకారంతో పాలకవర్గం అనుమతి తీసుకొని ప్రత్యేక నిధులతో విలీనమైన గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. టియుఎఫ్ఐడిసి 20 కోట్ల నిధులలో 5వ వార్డ్ కు 60 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు.

త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని అన్నారు. అలాగే ప్రతి వార్డులలో డ్రైనేజీ సమస్య గాని, నీటి సమస్య గాని, వీధి దీపాల సమస్య ఉన్నట్లైతే కౌన్సిలర్ దృష్టికి గాని, అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. పట్టణంలో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని అన్నారు.

రానున్న రోజుల్లో మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి విలీన గ్రామాలతో పాటు పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహ స్వామి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ సమస్యలపై మంత్రి కేటీఆర్‌కు వినతి



రాజన్న సిరిసిల్ల, జూన్ 25 (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రత్యేక ఛాంబర్ లో ఐటి, పురపాలక శాఖ మంత్రి కే. తారకరామారావును వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కలిసి పలు సమస్యలపై విన్నవించారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించి వెంటనే సబ్ కోర్టు ఏర్పాటుకు 6 లక్షలు కేటాయించి, వెంటనే పనులు ప్రారంభం చాలని అధికారులను ఆదేశించారు.

కోర్టు పక్కన ఉన్న 30 గుంటలపార్కింగ్ స్థలం , పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుచేయాలని కలెక్టర్ , అదనపు కలెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేముల సుధాకర్, కార్యదర్శి గుడిసె సదానందం, వైస్ ప్రెసిడెంట్ గడ్డంసత్యనారాయణ రెడ్డి, న్యాయవాదులు రజనీకాంత్, జంగం అంజయ్య,నర్సింగ రావు, అనిల్ కుమార్, నక్క దివాకర్, గంగరాజు, బొద్దు ప్రశాంత్ కుమార్, మనోహార్, మహేందర్, మహేష్ పాల్గొన్నారు.

# వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన నేర సమీక్ష సమావేశం

**- కేసు విచారణలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తే మరింత వేగంగా కేసుల పురోగతికి సాధ్యమవుతుందని రాష్ట్ర డీజీపీ యం. మహేందర్ రెడ్డి అన్నారు**

**- రాష్ట్ర డీజీపీ యం.మహేందర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన నేర సమీక్ష సమావేశం ఖమ్మం నుండి పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు**




ఖమ్మం, జూన్ 24 (నేటినిజం ప్రతినిధి): సమీక్ష సమావేశం డీజీపీ మాట్లాడుతూ ..కేసు విచారణలో ఏమైనా సందేహాలు వుంటే ఇన్వెస్టిగేషన్ సెంటర్ లో వున్న అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకొవాలని సూచించారు. ఫోక్సో సంబంధించిన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చూడాలన్నారు.

వెట్టి చాకిరీలో మగ్గుతున్న చిన్నారులకు విముక్తి కలిగించి, నిస్సహాయ స్థితిలో వున్న పిల్లలకు మంచి భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు.

క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్, ఎస్సీ ఎస్టీ, చైల్డ్ కేసులపై పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అయ కేసుల్లో పెండింగ్ లేకుండా మరింత పురోగతి సాధించాలని అన్నారు.

నేర నిరూపణలో సాంకేతికను సమర్ధవంతంగా వాడుకుంటూ..నేర నిరూపణకు అవసరమైన భౌతిక సాక్ష్యాలను, అధారలను సేకరించడం, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సమన్వయం చేసుకుంటూ.. సాక్ష్యాలను సకాలంలో న్యాయస్థానంలో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడేలా చేయాలని సూచించారు.

పోలీస్ స్టేషన్లలో ఏకీకృత సేవలను విస్తరింప చేయడం లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఫంక్షనల్ వర్టికల్స్ అమలు తీరును ఈ సందర్భంగా పరిశీలించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శభరీష్, అడిషనల్ డీసీపీ లాడఆర్డర్ సుభాష్ చంద్ర బోస్ , అడిషనల్ డీసీపీ(ఏ ఆర్) కుమారస్వామి, ఏసీపిలు సాధన రస్మీ పెరుమాళ్, రామోజీ రమేష్ , ప్రసన్న కుమార్, వెంకటస్వామి,అంజనేయులు, భస్వారెడ్డి, పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు నికర ఆదాయం : నిరంజన్‌రెడ్డి



వనపర్తి, జూన్ 25: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు నికర ఆదాయం లభిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఒకే రోజు 313 ఎకరాల్లో 15వేల ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఆత్మకూరు మండలంలో 88.17 ఎకరాలు, పెబ్బేరు 42.77, కొత్తకోట 38.77, వనపర్తి 37.60, పానగల్ 30.64, అమరచింత 20.47, గోపాల్ పేట 17, మదనాపూర్ 15, పెద్దమందడి 14, శ్రీరంగాపూర్ 4.57, రేవల్లి 4.57 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు.

చిట్యాల గ్రామంలో ముష్టి బాలీశ్వర్ ఐదెకరాల పొలంలో సామూహిక ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణతోనే అధిక ఆదాయం లభిస్తుందన్నారు. రైతులు సాంప్రదాయ సాగు నుంచి బయటకు రావాలన్నారు. దేశంలో బైబ్యాక్ గ్యారంటీ పాలసీ ఉన్న ఒకే ఒక పంట ఆయిల్ పామ్ అన్నారు. 20 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా తెలంగాణ ముందుకు సాగుతుందన్నారు.

ఏటా రూ.80వేల కోట్ల విలువైన వంటనూనెలు దిగుమతి చేసుకుంటున్నామని, 79 క్షేత్ర పర్యటనల ద్వారా 8,460 మంది రైతులకు ఆయిల్ పామ్ సాగు, ఇతర విషయాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వరి మినహా అన్ని రకాల పంటలను ఆయిల్ పామ్‌లో అంతరపంటలుగా సాగుచేయవచ్చని, నూనె, పప్పు గింజల సాగుపై దృష్టి పెట్టి.. ఆ దిశగా రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించుటకు పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్, స్మార్ట్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం

**-రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్**

కరీంనగర్ , జూన్ 25(నేటినిజం ప్రతినిధి): విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించుటకు పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్, స్మార్ట్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

శనివారం కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, సహారా ఏజెన్సీ ద్వారా, కరీంనగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కార్ఖానాగడ్డలో ఏర్పాటుచేసిన స్మార్ట్ క్లాస్ రూమ్ / స్మార్ట్ ల్యాబ్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో 52 ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్/ స్మార్ట్ ల్యాబ్ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇట్టి ప్రాజెక్టు ద్వారా పాఠశాలలకు గూగుల్ క్రోమ్ బుక్స్ (1000), కె- వై ఈఎన్ సీ (104), యుపిఎస్ లు (52), స్టూడెంట్ డెస్కులు (500) మరియు ఇంటర్నెట్ సౌకర్యం మొదలైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. వీటివలన విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించ బడుతుందని, విద్యార్థులు నేర్చుకున్న అంశాలను మదింపుచేసి తక్షణమే కాగితము లేని ప్రోగ్రెస్ రిపోర్టును తయారు చేయడానికి ఈ స్మార్ట్ క్లాస్ రూమ్/ స్మార్ట్ ల్యాబ్ ఉ



పయోగపడుతుందని తెలిపారు. ఆడియో, వీడియో ద్వారా విద్యార్థుల్లో అభ్యసనం పట్ల ఆసక్తి పెంపొందించ బడుతుందని తెలుపుతూ, ఈ స్మార్ట్ క్లాస్ రూమ్ నివిద్యార్థులందరూ సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులను మంత్రి కోరినారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వై. సునీల్ రావు , సుడా చైర్మన్ జీవి రామకృష్ణ రావు, జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్,అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్ ,నగర కార్పొరేటర్లు, జిల్లా విద్యా శాఖ అధికారి, సిహెచ్ వి ఎస్ జనార్దన్ రావు పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఎస్ఎంసి చైర్మన్ మండల విద్యాధికారి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు కర్నూలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com